

జిల్లా ఓటర్లు..

ఎట్టకేలకు తుది ఓటర్ల జాబితా విడుదలైంది. స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024లో చివరి అంకం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒక సాఫ్టు, ఒక హార్డ్ కాపీలను అంద జేసింది. అలానే సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లోనూ ఓటర్లకు అందుబాటు లోకి తీసుకొచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనందున ఇంకా ఎవరైనా ఓటు పొందలేకపోయి ఉంటే వారు కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. అలానే ఎవరైనా చనిపోయినా, చిరునామా మారినా సంబంధిత దరఖాస్తులను పెట్టుకోవచ్చు.

- మహిళా ఓటర్లే అధికం
- స్వల్పంగా పెరిగిన ఓట్లు
- పారదర్శకంగా రూపొందించామన్న కలెక్టర్
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేత
- ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో..

17,12,829

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ పూర్తయింది. తుది జాబితాలను కలెక్టర్ శివ శంకర్ లోతేటి సోమవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 17,12,829 మంది ఓటర్లగా నమోదై ఉన్నారు. గతం కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది. 8,37,200 మంది పురుషులు, 8,75,433 మంది మహిళలు, థర్డ్ జండర్ 196 మంది ఓటర్లుగా ఉన్నారు. పురుషుల కంటే మహిళల ఓట్లు 38,233 అధికంగా ఉన్నాయి. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 2,71,277 ఓట్లు నమోదు కాగా తక్కువగా పెదకూరపాడు నియోజకవర్గంలో 2,28,936 ఓట్లు ఉన్నాయి. ఓటర్ల జాబితా సవరణకు ముందు గత ఏడాది జనవరిలో 16,86,524 ఓట్లు ఉండగా సవరణ అనంతరం 17,12,829 ఓట్లు పెరిగాయి. ఏడాది కాలంలో 24,779 ఓట్లు పెరిగాయి. ఫారం -6లు 1,39,671 అందగా 1,10,345 ఆమోదించగా 24,400 దరఖాస్తులను తిరస్కరించారు. ఫారం-7లు 1,34,669 దరఖాస్తులు దాఖలు కాగా 1,02,790 ఆమోదించగా 28,403 తిరస్కరించారు. ఫారం-8లు 1,07,568 దాఖలయ్యాయి. వీటిలో 97,654 ఆమోదించి 5,715 తిరస్కరించారు. ఈ మూడు రకాల దరఖాస్తులు 3,81,908 దాఖలయ్యాయి. వీటిలో 3,10,789 ఆమోదించగా 58,518 తిరస్కరించారు. కొత్తగా 1,11,178 ఓట్లు నమోదు కాగా 1,03,788 ఓట్లు తొలగించారు. తొలగింపుల్లో 60,678 మృతుల, 30,907 ఓట్లు వలసదారులు, 12,203 డబుల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయి. జిల్లాలో 1926 పోలింగ్ స్టేషన్‌లను గుర్తించారు. పట్టణాల్లో 422, గ్రామాల్లో 1504 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి.

నామినేషన్‌ల స్వీకరణ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..

తుది జాబితాల విడుదల అనంతరం కూడా కొత్తగా ఓటు నమోదుకు నామినేషన్ల స్వీకరణ చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ శివ శంకర్ తెలిపారు. ఇలా నమోదు చేసిన ఓటర్లకు సంబంధించి ప్రత్యేక జాబితాలను పోలింగ్ బూత్‌ల వారీగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో వినాయకం పాల్గొన్నారు.

ఓటర్ల నిష్పత్తి 736..

జిల్లాలో 23,26,704 మంది జనాభా ఉండగా 17,12,829 మంది ఓటర్లుగా ఉన్నారు. జనాభాలో ఓటర్ల నిష్పత్తి 736 గా నమోదైంది. వెయ్యి జనాభాకు సగటున 724 ఓటర్లు ఉండాలని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీని ప్రకారం జిల్లా ఓటర్ల సగటు నిష్పత్తి కంటే 12 శాతం అధికంగా ఓటర్లు ఉన్నారు. ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో సగటు ఓటర్ల నిష్పత్తి అధికంగా ఉండటం గమనార్హం. గురజాల నియోజకవర్గంలో సగటు ఓటర్ల నిష్పత్తి 29 శాతం అధికంగా ఉంది. జిల్లాలో ఉన్న జనాభాలో ఉండాల్సిన ఓట్ల శాతం కంటే ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గురజాల నియోజకవర్గంలో వెయ్యి మంది జనాభాకు సగటున 753 ఓటర్లు ఉన్నారు. ఈ నిష్పత్తి అసాధారణమైనదని ఎన్నికల కమిషన్ నిబంధనలు తెలియజేస్తున్నాయి. పెదకూరపాడులో వెయ్యి మందికి 745 ఓటర్లు, వినుకొండలో 741, సత్తెనపల్లిలో 745, నరసరావుపేటలో 735 మంది ఓటర్లు ఉన్నారు. వీటిపై సమగ్ర పరిశీలన జరగాల్సి ఉంది. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉండటం, వలస వెళ్ళిన, చనిపోయిన వారి పేర్లు జాబితాల నుంచి తొలగించడంలో పారదర్శకత లోపించడం వలనే ఈ పరిస్థితి తలెత్తిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటర్ల సమస్యలపై డయల్ యువర్ కలెక్టర్

ఓటర్లకు సంబంధించిన సమస్యలు తెలుసుకొనేందుకు ప్రతి బుధవారం డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించనున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రెండు గంటల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 08647 252999 నెంబరుకు ఆ సమయంలో కాల్ చేసి ఓటర్లు వారి సమస్యలు, ఓటర్ల జాబితాలో ఎక్కడైనా తప్పులు దొర్లితే ఆ వివరాలను తెలియజేయవచ్చని ఇలా స్వీకరించిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరిస్తామని అన్నారు. అలాగే ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం కూడా నిర్వహిస్తామన్నారు. తుది ఓటర్ల జాబితాలను అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేశామన్నారు. అలాగే జిల్లాలోని 1926 పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల జాబితాలను ఏర్పాటు చేశామని, అలాగే బీఎల్‌వోల వద్ద ఓటరు లిస్టులు ఉంటాయని చెప్పారు. ఎంతో పారదర్శకంగా ఓటర్ల జాబితాలను రూపొందించామని, ఇందుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాయన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్ లోతేటి

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు
పెదకూరపాడు	1,12,021	1,16,897	16	2,28,936
చిలకలూరిపేట	1,07,438	1,16,934	49	2,24,421
నరసరావుపేట	1,11,756	1,17,748	29	2,29,533
సత్తెనపల్లి	1,17,108	1,21,955	29	2,39,077
వినుకొండ	1,29,520	1,29,520	22	2,60,306
గురజాల	1,32,131	1,39,104	42	2,71,277
మాచర్ల	1,27,226	1,32,031	22	2,59,279
మొత్తం	8,37,200	8,75,433	196	17,12,829


బాపట్ల జిల్లాలో.. 12,75,540

ఈసీ విడుదల చేసిన తుది ప్రచురణలో బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం ఓట్లు 12,75,540గా పేర్కొనగా ఇందులో మహిళల వాటా 6,52,941గా ఉంది. పురుష ఓటర్లతో పోలిస్తే 30,415 మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్యలో 2,41,081 ఓట్లతో అద్దంకి ప్రథమస్థానంలో ఉండగా, 2,26,566 ఓట్లతో రేపల్లె రెండో స్థానంలో నిలిచింది. ఇక వరుసగా పర్చూరులో 2,25,770, చీరాలలో 1,98,643, వేమూరులో 1,95,756, 1,87,724 ఓట్లతో బాపట్ల చివరి స్థానంలో నిలిచింది. తుది ప్రచురణలో ఆశించిన స్థాయిలో జిల్లాలో పెరుగుదల కనబడలేదు. 2023 జనవరి 5నవిడుదల చేసిన ఫైనల్ పబ్లికేషన్‌లో జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 12,52,432గా చూపెట్టగా ప్రస్తుతం విడుదల చేసిన తుది జాబితాలో ఆ సంఖ్య 12,75,540 కే పరిమితమైంది. గతేడాది తుది ప్రచురణతో పోలిస్తే కేవలం 23,108 ఓట్ల పెరుగుదల మాత్రమే నమోదు కావడం గమనార్హం. గతేడాది అక్టోబరులో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే ఈ వృద్ధి 12,408 ఓట్లకే పరిమితమైంది.



గుంటూరు జిల్లాలో.. 17,72,022

తుది ఓటర్ల జాబితా ప్రకారం గుంటూరు జిల్లా ఓటర్ల సంఖ్య 17,72,022కి చేరింది. జిల్లాలో 9,13,852 మంది ఓటర్లతో మహిళలు తమ పైచేయిని నిలబెట్టుకొన్నారు. తద్వారా మొత్తం ఓటర్లలో 51.65 శాతంగా ఉన్నారు. పురుషులు 8,55,262, ట్రాన్స్ జెండర్లు 191 కలిపి మొత్తం ఓటర్లు 17,69,305 మంది ఉన్నారు. వీళ్ల కాక ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు పురుషులు - 724, మహిళలు 206, సర్వీసు ఓటర్లు పురుషులు 1714, మహిళలు 73 కలిపి మొత్తంగా 17 లక్షల 72 వేల 022కి ఓటర్ల సంఖ్య చేరుకొన్నది. ముసాయిదా ఓటర్ల జాబిత ప్రచురించేనాటికి 17,37,447 మంది ఓటర్లున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే చేర్పులు, తొలగింపులు అనంతరం 34,575 మంది ఓటర్లు పెరిగారు. అలానే 18-19 ఏళ్ల వయస్సు ఓటర్లు 14,399 మంది ఉంటే ఆ సంఖ్య నేడు 35,762కి పెరిగింది. 80 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 31,800, దివ్యాంగులు 14,270 మంది ఓటర్లున్నారు. లింగ నిష్పత్తి ప్రతీ 1000 మంది పురుషులకు 1069 మంది మహిళలున్నారు. ఎలక్టోరల్ పాపులేషన్ రేషియో ప్రతీ వెయ్యి మంది పౌరుల్లో 730 మంది ఓటర్లున్నారు.



నాడు-నేడుకు నిధుల గ్రహణం

- విడుదల కాని నిధులు
- శ్లాబ్‌దశ దాటి ముందుకు కదలని అభివృద్ధి పనులు
- వాటర్‌ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్‌కు నిధుల్లేవ్..
- మరోమూడు నెలల్లో ముగియనున్న విద్యాసంవత్సరం



లాలుపురం జడ్పీస్కూల్‌లో అసంపూర్తిగా భవనాలు

ఒక చోట శ్లాబ్ పూర్తయినా అంతర్గత గోడల నిర్మాణం జరగలేదు.. మరో చోట ఇంకా శ్లాబ్ దశలోనే వెక్కిరిస్తున్న నిర్మాణాలు.. ఇంకో చోట ఎలక్ట్రికల్, పంబ్లింగ్ పనుల్లో జాప్యం.. మరో చోట వాటర్ ప్లాంట్స్ వచ్చినా ఇన్‌స్టలేషన్‌కు నిధులు లేక పరదాలు కప్పి నెట్టుకొస్తున్న వైనం.. ఇదీ ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనుల దుస్థితి. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం నిర్మాణాలు అందుబాటులోకి వస్తాయో లేదోననే అనుమానం ప్రధానోపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు(విద్య), జనవరి 22: ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు రెండు విడతల్లో ప్రారంభం అయ్యాయి. మొదటి విడత దాదాపు 1,170 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా రెండో విడత 680 పాఠశాలల్లో నిర్మాణాలు ప్రారంభించారు. నాడు నేడు పనుల్లో ప్రధానంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, బెంచీల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు ఏర్పాటు, ఆర్వోప్లాంట్స్ నిర్మాణం ఇలా అనేక పనుల్ని ఇందులో చేర్చారు. తొలి విడతతో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసిన అనేక పనులు ఇంకా పూర్తిదశకు చేరుకోలేదు. ఇక రెండో దశ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

నిధుల విడుదల ఏదీ?

ప్రభుత్వం నాడు నేడు పనులతో సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని సొంత డప్పు కొట్టుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్ మొదటి రెండో విడత నాడు నేడు పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తి ఉన్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని స్కూల్స్ విషయం అటుంచితే గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం(ఏటీ అగ్రహారం), పట్టాభిపురం మున్సిపల్ స్కూల్, కొల్లిశారద మున్సిపల్ స్కూల్ (కేవీపీ కాలనీ.) లాలుపురం జడ్పీ స్కూల్(వికలాంగుల కాలనీ) ఇలా అనేక చోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని స్లాబ్ పూర్తిగా కొన్ని ఫినిషింగ్ దశలో మరికొన్ని పిల్లర్స్ స్థాయిలో పనులు ఉన్నాయి.

వాటర్‌ప్లాంట్ మిషన్లకు ముసుగేశారు..

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనుల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో అనేక స్కూల్స్‌కు వాటర్ ప్లాంట్స్ యంత్రాలు వచ్చాయి. వాటిని ఇన్‌స్టాల్ చేయడానికి కూడా నిధులు లేవు. ఒక్కో యంత్రం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏజన్సీలు వీటిని తీసుకువచ్చి పాఠశాల ప్రాంగణాల్లో పెట్టి ముసుగేశారు. వీటిని ఇన్‌స్టలేషన్ చేయడానికి నిర్దేశించిన ప్రాంతంలో షెడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తి కాకుండానే వాటర్‌ప్లాంట్స్ మిషన్లు పాఠశాలలకు పంపారు. ఇప్పుడు అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉన్నాయి. కాంట్రాక్టర్లు నిధులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయినట్లు చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాలి. మరోవైపు నాడు నాడు పనుల సిమెంట్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, శానిటరీ మెటీరియల్‌తో తరగతి గదులు, ఇసుక, కంకర, ఇనుము వంటి మెటీరియల్‌తో పాఠశాలల్లో ఆటస్థలాలు నిండిపోయాయి. ఈ విద్యాసంవత్సరం నాడు నేడుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు అందుబాటులోకి వస్తాయో లేదో వేచి చూడాల్సి ఉందని హెచ్‌ఎంలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఎన్జీవోకాలనీలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ముసుగు వేసిన వాటర్‌ప్లాంట్ మిషన్

జై శ్రీరామ్



నరసరావుపేట పట్టాభిరామ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల అలంకరణ

- మార్మోగిన పల్లెలు.. పట్టణాలు
- అంతా రామమయం
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు
- వైభవంగా ఊరేగింపులు
- బైక్ ర్యాలీలు.. ప్రదర్శనలు
- అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్స్‌పై వీక్షించిన భక్తులు

నరసరావుపేట, జనవరి 22: అయోధ్య ఆలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. టీవీల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్స్‌పై ఈ కార్యక్రమాన్ని భక్త జనులు కనులారా వీక్షించి పులకించిపోయారు. జై శ్రీరామ్ నినాదం మార్మోగింది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా శ్రీరాముని ఊరేగింపులు, ప్రదర్శనలు వైభవంగా జరిగాయి. శ్రీ రాముడు, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, శ్రీరామ కీర్తనలను ఆలపించారు. వ్యాపార సంస్థలు, గృహాలపై శ్రీరాముడి చిత్రం ఉన్న జెండాలను అలంకరించారు. యువకులు శ్రీరాముని పతాకాలను చేతబూని నృత్యాలు చేశారు. శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ పూర్తయిన అనంతరం ఎక్కడికక్కడ పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. పట్టణాల్లో వీధులకు శ్రీరాముని తోరణాలు అలంకరించారు. శ్రీరాముని భక్తి పారవశ్యంలో భక్తులు మునిగిపోయారు. అంతా రామమయంగా మారింది. అయోధ్య నుంచి తీసుకొచ్చి ముందుగా ఇంటింటికి పంపిణీ చేసిన అక్షింతలను తలపై చల్లుకున్నారు. ఇళ్లల్లో కూడా భక్తులు పూజలు చేశారు.

జిల్లా కేంద్రం నరసరావుపేటలో శ్రీరాముని ఊరేగింపు ఘనంగా జరిగింది. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టాభిరామ స్వామి దేవాలయంతో శ్రీరామునికి విశేష పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ దేవాలయంలోని కళ్యాణ మండపంలో శ్రీ సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వందలాది మంది భక్తులు శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించారు. పట్టణంలో శ్రీరాముని ఊరేగింపు కోలాహలంగా జరిగింది. మొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై శ్రీరాముని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించారు. ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. పల్నాడు రోడ్డు బైపాస్ సెంటర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం, శివుని విగ్రహం సెంటర్‌లలో మోర్ సెంటర్, పట్టాభిరామ స్వామి దేవాలయంలో పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, హూడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై..వేటు

- పల్నాడు జిల్లాలో 1,358 మంది తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, జనవరి 22: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. వారి ఉద్యమాన్ని పూర్తి అణచివేసే దిశగా కొరడా ఝుళిపించింది. పల్నాడు జిల్లాలో 1,358 మంది అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టుగా కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. షోకాజ్ నోటీసులు ఇచ్చినా విధుల్లో చేరని అంగన్‌వాడీలపై వేటు పడింది. జిల్లాలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,372 సెంటర్లకు చెందిన 1,299 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు 1,253 మంది సహాయకులు విధుల్లో చేరారు. 693 మంది కార్యకర్తలు, 665 మంది సహాయకులు నోటీసులు జారీ చేసినా విధుల్లో చేర లేదు. వీరందరూ ఇంకా నిరధిక సమ్మెలోనే ఉన్నారు. సదరు ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా ఖాళీలను భర్తీ చేసేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రంగం సిద్ధం అవుతోంది. న్యాయబద్ధంగా సాగిస్తున్న తమ పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్ని బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమ్మె విరమించి విధుల్లో చేరని తమను తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శమని మండిపడుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకు పోరు బాట వీడేది లేదని.. విధుల్లో చేరం.. బెదిరింపులకు వెరవం అంటున్నారు. కొత్తవారిని ఎలా నియమిస్తారో చూస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. కనీస వేతం, గ్రాట్యూటీ అమలు కోరుతూ అంగన్‌వాడీలు సాగిస్తున్న ఉద్యమం సోమవారం 42వ రోజుకు చేరుకుంది. తమకేదో మేలు చేస్తారని జగన్‌ను గెలిపిస్తే వేతనాలు పెంచకుండా ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పి తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. జిల్లాలో వివిధ రూపాల్లో నిరసనలు తెలియ జేశారు. అంగన్‌వాడీల సమ్మెకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది.



సత్తెనపల్లిలో పోలీసు స్టేషన్‌లో ఉన్న అంగన్ వాడీలను పరామర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు



తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి రాష్ట్ర సంపద

● దానిని నిర్వీర్యం చేయడం తగదు

● 1497వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 22: మళ్ళీ అధికారంలోకి రారని తెలిసి వైసీపీ నేతలు రాష్ట్రంలో అందినకాడికి దోచుకుంటున్నారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1497వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్ర సంపద అయినటువంటి అమరావతిని నిర్వీర్యం చేయటం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతి అని చెపితేనే భూములిచ్చామని స్పష్టం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడు రాజధానులంటూ అమరావతి కలను చిదిమేశారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్ళూరు, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు, నిరసన దీక్షలు కొనసాగాయి.

1500వ రోజు శిబిరాల్లోనే...

రైతు ధర్నా శిబిరాల్లోనే 1500వ రోజు అమరావతి ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సోమవారం రైతు సమన్వయ కమిటీ నిర్ణయించింది. జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం అయిన కమిటీ ముందుగా దళిత ఉద్యమ నేత గడ్డం మార్టిన్‌కు నివాళి అర్పించింది. తదనంతరం ఉద్యమ కార్యచరణ ప్రణాళికపై చర్చించింది. ఏ శిబిరంలో వారు ఆ శిబిరంలోనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించింది.

కృష్ణమ్మ ఒడిలో లోకేశ్ జన్మదిన వేడుకలు

తుళ్ళూరు జనవరి 22: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేశ్ జన్మదిన వేడుకలు రాజధాని అమరావతిలో ఒక రోజు ముందుగా జరిగాయి. దళిత జేఏసీ, టీడీపీ నాయకుడు పులి చిన్నా(మరియదా సు) ఆధ్వర్యంలో తాళ్ళాయపాలెం పుష్కర ఘాట్ వద్ద కృష్ణానదిలో ఈ వేడుకలు సోమవారం నిర్వహించారు. నీళ్ళలో లోకేశ్ భారీ కటౌట్‌ను ఊరేగించారు. పడవలతో నీళ్లల్లో ర్యాలీ చేశారు. కటౌట్‌కు పూలు చల్లుతూ, బాణసంచా కాల్చారు. కేక్‌ను కత్తిరించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర యువతకు భరోసానిచ్చిందన్నారు. అందుకు కృతజ్ఞతగా వినూత్న రీతిలో ఆయన పుట్టినరోజు వేడుకలు ముందస్తుగా జరపాలని కృష్ణానదిలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత యువత, పాతర్ల రమేష్, మాదిగ మహానాడు నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానదిలో పడవల ర్యాలీతో భారీ కటౌట్‌ను ఊరేగిస్తూ లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మరికొందరు సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 22: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రేంజిలో సీఐల బదిలీల పరంపర కొనసాగుతోంది. దీనిలో భాగంగా సోమవారం మరికొందరు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. మేడికొండూరు సీఐ కె.వాసును గుంటూరు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా విభాగానికి బదిలీ చేశారు. పల్నాడు జిల్లా కారంపూడి సీఐ డి.జయకుమార్‌ను మేడికొండూరు సీఐగా నియమించారు. పాత గుంటూరు సీఐ మొగిలి వెంకట సుబ్బారావును నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం సీఐగా, ఇప్పటివరకు అక్కడ సీఐగా ఉన్న హైమారావును బుచ్చిరెడ్డిపాలెం ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. వీఆర్‌లో ఉన్న బి.రమేష్ బాబును పాత గుంటూరు సీఐగా నియమించారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం సీఐ బి.పాపారావును తిరుపతి జిల్లా గూడూరు 1వ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీవుల్లాను ప్రకాశం జిల్లా దర్శి సీఐగా నియమించారు. దర్శి సీఐ జె.రామకోటయ్యను వీఆర్‌కి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న బీవీవీ సుబ్బారావును గూడూరు సీఐగా నియమించారు. ప్రకాశం జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ కె.అజయ్ కుమార్‌ను నెల్లూరు జిల్లా దిశ 2 సీఐగా నియమించారు. వీఆర్‌లో ఉన్న టి.విజయ్ కృష్ణను ప్రకాశం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ప్రకాశం సీసీఎస్‌లో ఉన్న పి.బాలాజీని వీఆర్‌కు బదిలీ చేశారు.

● రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు సొంత జిల్లాలో పనిచేస్తున్న 75 మంది ర్యాంకర్ ఎస్‌ఐలను వేర్వేరు జిల్లాలకు బదిలీచేస్తూ ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లాలో 16 మందిని, పల్నాడు జిల్లాలో ఏడుగురిని, బాపట్ల జిల్లాలో 8 మందిని, ప్రకాశం జిల్లాలో 20 మందిని, నెల్లూరు జిల్లాలో 17 మందిని, తిరుపతి జిల్లాలో ఏడుగురిని ఇతర జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

28న జయదేవ్ వీడ్కోలు విందు

● పార్లమెంటు పరిధిలోని 4వేల మంది కార్యకర్తలకు ఆహ్వానం

● హ్యాట్రిక్ కొట్టే అవకాశం ఉన్నా పోటీకి విముఖత

● ఇక పూర్తికాలం వ్యాపారాలపైనే దృష్టి



గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఊహించిన విధంగానే క్రియాశీలక రాజకీయాలకు గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 27వ తేదీ సాయంత్రానికి జయదేవ్ తన తల్లి గల్లా అరుణతో పాటు గుంటూరుకు చేరుకుంటారు. 28న రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున విందు ఇచ్చి వారి వద్ద సెలవు తీసుకోనున్నారు. గత రెండు ఎన్నికల్లో తన విజయానికి సహకరించిన ఆయా నియోజకవర్గాల నేతలను, పార్టీ కార్యకర్తలను ఈ విందుకు హాజరవ్వాల్సిందిగా ఆహ్వానిస్తున్నారు. సుమారు 4వేల మంది ఈ విందుకు హాజరవుతారని భావిస్తున్నారు. 2014లో అనూహ్యంగా గుంటూరు పార్లమెంటు పరిధి నుంచి ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. అలాగే 2019లో రెండోసారి ఎన్నికల బరిలోకి దిగి ఊహించని ఘన విజయం సాధించారు. పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించినప్పటికీ ఎంపీగా జయదేవ్ గెలవటం వైసీపీలో కలవరం రేకెత్తించింది. జయదేవ్ చిత్తూరు జిల్లా నుంచి గుంటూరు జిల్లాకు వలస వచ్చినప్పటికీ ఇక్కడి పార్టీ శ్రేణుల ఆదరణ ఎంతగానో పొందారు. వ్యాపార రీత్యా నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోయినప్పటికీ పార్లమెంటు సమావేశాలకు తప్పనిసరిగా హాజరై స్థానిక సమస్యలపై తన గళం వినిపించేవారు. విదేశాల్లో చదువుకున్న జయదేవ్‌కు ఇంగ్లీష్ బాషపై మంచి పట్టు ఉండటంతో పార్లమెంటు సమావేశాల్లో ఆయన ప్రసంగాలు ఆకట్టుకునేలా ఉండేవి. ప్రత్యేక హోదాపై కూడా సభలో అలుపెరగని పోరాటం చేయటమే కాకుండా మిస్టర్ మోదీ అంటూ ప్రధానిని నిలదీయటం అప్పట్లో చర్చనీయాంశమైంది. రానున్న ఎన్నికల్లో కూడా తిరిగి జయదేవ్‌నే తమ పార్టీ తరఫున బరిలోకి దించాలని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు భావించినప్పటికీ పోటీకి విముఖత వ్యక్తపరచటం జరిగింది. దీంతో జయేదవ్‌కు బదులుగా మరొకరిని గుంటూరు బరి నుంచి దింపేందుకు టీడీపీ యోచిస్తోంది.

అమలాపురం తరహాలో అల్లర్లకు వైసీపీ కుట్ర

● తన ఫొటోతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

● దీని వెనుక ఓ మంత్రి, ఎమ్మెల్యే పీఏలు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపణ

● గుంటూరులోని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



గుంటూరులోని ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

గుంటూరు, జనవరి 22: అమలాపురంలో కులాల మధ్య విధ్వంసం సృష్టించిన విధంగానే కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కూడా అల్లర్లు, విధ్వంసాలకు వైసీపీ భారీ కుట్రకు తెరతీసిందని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. తన ఫొటో పెట్టి అంబేద్కర్‌పై తాను అనని మాటలను అన్నట్లుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలతో వైరల్ చేసి విధ్వంసానికి కుట్ర చేశారన్నారు. ఈ మేరకు సోమవారం గుంటూరులో ఎస్పీ కార్యాలయంలోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అందుబాటులో లేకపోవడంతో స్పందనలో ఉన్న డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కుట్ర వెనుక మంత్రి సీదిరి అప్పలరాజు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసీపీ సోషల్ మీడియా డిజిటల్ క్రియేటర్, నందిగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాస్ వెంకట్ సుంకరతోపాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పొత్తుతో అధికారం కోల్పోతున్నామనే భయంతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అమలాపురం తరహాలో కులచిచ్చు రేపి అల్లర్లు, విధ్వంసాలు సృష్టించాలని వైసీపీ నాయకులు కుట్రపన్నినట్లు ఆరోపించారు. ఈ పోస్ట్ ను పలనాడు న్యూస్ వాట్సాప్ గ్రూపులో టీం గోపిరెడ్డి పేరుతో ఎమ్మెల్యే పీఏ, అలాగే మంత్రి సీదిరి అప్పలరాజు పీఏ వెంకట రమణ తన ఫేస్ బుక్ పేజీలో ఉంచి తనపై తీవ్ర ఆరోపణలు చేశారన్నారు. సాక్ష్యాధారాలతో సహా ఈ నెల 20న పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. తాను తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని ప్రకటించారు. దీనిపై తక్షణం కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దాసరి రమణ, గుడిమెట్ల దయారత్నం, సుఖవాసి శ్రీనివాసరావు, పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), రావిపాటి సాయి కృష్ణ, పొన్నూరు రూరల్ పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, పెదకాకాని మండల పార్టీ అధ్యక్షులు మురళీకృష్ణ, బ్రహ్మారెడ్డి, కూచిపూడి రాజేష్ , జయరామిరెడ్డి, బూసిబాబు, అమరేంద్ర, తాళ్ల శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, సుబ్బారావు, సంజీవ్, సాంబిరెడ్డి పెద్ద విక్రమ్, పిన్నమనేని రామచంద్రరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

27న గుంటూరుకు ఏపీసీసీ చీఫ్ షర్మిల

● కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమీక్ష

గుంటూరు, జనవరి 22: ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ షర్మిల ఆ పార్టీ ముఖ్యనేతలతో సమీక్ష కోసం జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈనెల 27న తొలిసారిగా గుంటూరు పర్యటనకు షెడ్యూల్ ఖరారు చేశారు. 27న ఒకే రోజున కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఉదయం కృష్ణా జిల్లా బందరు పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రం గుంటూరు పర్యటనకు రానున్నారు. సాయంత్రం 5 గంటలకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు వైఎస్ షర్మిల చేరుకునేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఆయా జిల్లాల్లో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ నుంచి దూరమై తటస్థంగా ఉంటున్న నేతల వివరాల వంటి అంశాలపై స్థానిక నేతలను అడిగి తెలుసుకోనున్నారు. ప్రస్తుతం జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు సమీక్షా సమావేశాలకు తరలిరావాలని నేతలు ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 22: వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్లేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బాదుడే బాదుడని, సంక్రాంతి కానుక, క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా తీసివేశారని, టీడీపీ అధికారంలో ఉన్నపుడు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తే, వైసీపీ వచ్చాక నాసిరకం మద్యం ఇస్తూ ధరలు పెంచారన్నారు. మద్యనిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మందుబాబులను కూడా మోసం చేశారని విమర్శించారు. టీడీపీ ఐదు సంవత్సరాలలో ఒకసారికూడా కరెంట్ చార్జీలు పెంచలేదని, వైసీపీ వచ్చాక ఆర్టీసీ చార్జీలు, కరెంటు చార్జీలు పెంచారన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 200 యూనిట్ల లోపు కరెంట్ ఉచితం అన్నారని, కానీ ఇవ్వలేదన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు బలహీనవర్గాలేనన్నారు. వైసీపీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్య చేసుకుంటున్నారని, 29మంది దళిత ఎమ్మెల్యేలను బదిలీ చేశారని విమర్శించారు. కబ్జా చేసిన వారికే న్యాయం చేసే ప్రభుత్వం ఇదని, భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే మీ భూములు దక్కవన్నారు. టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దుచేస్తామని, డంపింగ్‌యార్డ్‌లో వేయాల్సిన చెత్త మరో ఊరిలో వేస్తారా? అని ప్రశ్నించా రు. చెల్లికి న్యాయం చేయలేని వాడు ఇక ప్రజలకేం చేస్తారని, విలువలు లేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులన్నారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారని, గిరిజన సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన 16 పథకాలను జగన్‌రెడ్డి నిలిపేశారన్నారు. బీసీలకు ఏటా రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా? అని జీవీ ప్రశ్నించారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర



కిరణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విలియం క్యారీ, ప్రసాద్‌రెడ్డి

గుంటూరు(మెడికల్), జనవరి 22: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమైదని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు ఎన్‌ఎల్‌ఎన్ ప్రసాద్ రెడ్డి ఉద్ఘోధించారు. సోమవారం జీజీహెచ్ శుశృతహాల్‌లో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసిస్టులకు నిర్వహించిన నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రోగులు వైద్యుల సలహా లేకుండా విచ్చలవిడిగా యాంటీ బయోటిక్ మందులు వాడితే ఔషధ నిరోధకత ఏర్పడి భవిష్యత్తులో చిన్న ఇన్‌ఫెక్షన్లు సైతం మొండి వ్యాధులుగా వేధిస్తాయని ప్రసాద్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఏ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యుల సలహా లేకుండా రోగులు సొంత వైద్యం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం క్యారీ, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు బి.రాజశేఖరరెడ్డి, జి.దుర్గాప్రసాద్, కే రవీంద్రరెడ్డి, పులిపాటి సౌజన్య, సీహెచ్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో వివిధ అంశాలపై ఫార్మసీ నిపుణులు ప్రసంగించారు.



ఆలీసాహెబ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్

భార్యపై గొడ్డలితో దాడి

● ఆపై పురుగుమందు తాగి భర్త ఆత్మహత్య

పెదనందిపాడు, జనవరి 22: భార్యపై గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడి, ఆపై పురుగుమందు తాగి భర్త మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారైన జరుగులవారిపాలెంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ ఆలీసాహెబ్ (50), మస్తాన్‌బీలు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మస్తాన్‌బీని ఆలీసాహెబ్ గొడ్డలితో నరికి తీవ్రంగా గాయపరిచి ఆమెను ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు. అనంతరం ఇంటి తలుపులు మూసివేసి ఆలీసాహెబ్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లోనే ఉన్న మనవడు తన తల్లికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి చూడగా మస్తాన్‌బీ అప్పటికే తీవ్రరక్తస్రావమై అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆమెను వెంటనే ప్రైవేటు వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఇంట్లోకి వెళ్ళి చూడగా ఆలీసాహెబ్ అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ అబ్దుల్‌రెహమాన్ చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై భార్య మస్తాన్‌బీ, కుమార్తె నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మన ప్రభుత్వంలో న్యాయం చేస్తాం..

● కన్నా లక్ష్మీనారాయణ



సానికొమ్ము రమణారెడ్డితో మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, జనవరి 22: రెండు నెలలు ఓర్చుకో.. రానున్న ఎన్నికల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది.. అప్పుడు నీకు న్యాయం చేస్తానని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ... సానికొమ్ము రమణరెడ్డికి హామీ ఇచ్చారు. మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కన్నా లక్ష్మీనారాయణ ఇంటింటికీ తిరుగుతూ సానికొమ్ము రమణరెడ్డి ఇంటికి వెళ్లి బాగున్నారా అని ప్రశ్నించారు. ఏం బాగుటాం సార్ నా కుమారుడును చంపారు అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధపడుతున్న రమణరెడ్డి ఓదార్చి అసలు ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. నీవు ఏం బాధపడకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది అప్పుడు నీ కుమారుడును ఎవరు చంపారు అనే విషయాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసి దోషులకు శిక్ష పడేలా చేస్తానని హామీ ఇచ్చారు.

27 నుంచి రాజధాని రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లకు

మూడో విడత ఈ-లాటరీ

విజయవాడ, జనవరి 22: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మూడో విడత ఈ-లాటరీని గ్రామాలవారీగా విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో కాంపిటెంట్ అథారిటీస్ నిర్వహిస్తారని కమిషనర్ వివేక్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు మాస్టర్ ప్లాన్‌కు లోబడి ఈ ప్రక్రియ జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే సంబంధిత భూయజమానులకు వ్యక్తిగతంగా సమాచారం అందించామని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ లాటరీ జరుగుతుందని వివరించారు.

గ్రామాలవారీగా ఈ-లాటరీ నిర్వహించే తేదీలు

ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఐనవోలులో, 27వ తేదీ ఉదయం 11.30 గంటలకు నేలపాడులో, 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు శాఖమూరులో, 27వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు తుళ్లూరు 1&2లో, అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతవరంలో, 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు కురగల్లు 1, 2లో, 30వ తేదీ ఉదయం 11 గంటలకు నెక్కల్లులో, 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణాయపాలెంలో, 30వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నిడమర్రు 1, 2లో, 31వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడిలో, 31వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు ఉద్దండరాయునిపాలెంలో, ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 11 గంటలకు మందడం 1, 2లో, ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు కొండమరాజుపాలెంలో, ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు నవులూరు 1&2లో, ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు లింగాయపాలెంలో, ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు వెంకటపాలెంలో, ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు రాయపూడి 1, 2లో ఈ-లాటరీ తీస్తామని వివరించారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

దుర్గి, జనవరి 22: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 70వ కల్యాణ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగిన ఆరుపళ్ల విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రకాశం జిల్లా, నాగుల ఉప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత రికార్డు స్థాయిలో 4846 అడుగుల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా కొండబాలువారిపాలూపిరిజ చెందిన గుంటవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి ఎడ్లజతలు 4732 అడుగులు, 4500 అడుగులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కృష్ణా జిల్లా ఆమర్రు మండలం బుల్లిపర్రు గ్రామానికి చెందిన గుంటూరు బుల్లికొండలు నాయుడు ఎడ్లజత నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి ఎడ్లజత ఐదోస్థానం, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన ముండ్రా జీవప్రసాద్ ఎడ్లజత ఆరోస్థానంలో నిలిచాయి. ఈ పోటీలను వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి రైతుల, ప్రజలు భారీగా తరలివచ్చారు. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గంది గోపాలరావులు పోటీలను పర్యవేక్షించారు. మంగళవారం న్యాకేటగిరి విభాగంలో పోటీలు జరగనున్నాయి.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,15,589 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,04,121 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డు ఆవరణలో 52,793 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			డీలక్స్	10000	19500
334	8500	20000	తెల్లకాయలు	5000	12000
నెంబరు. 5	9000	15000	**ఏసీ కామన్ వెరైటీ**		
273	10500	18000	334	--	--
341	9000	20000	273	--	--
4884	11000	14000	341	--	--
సూపర్ 10	10000	12000	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	--	--
తేజ	8000	21000	బ్యాడిగి	--	-
బ్యాడిగి	9000	21000	దేవనూరుడీలక్స్	--	--
దేవనూరు			తెల్లకాయలు	--	--

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109, 120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నియోజకవర్గ ఓటర్ల జాబితా విడుదల

● మహిళా ఓటర్లే అధికం

పిడుగురాళ్ల, జనవరి 22: గురజాల నియోజకవర్గ ఓటర్ల నూతన జాబితా విడుదలైంది. గత ఏడాది అక్టోబరు నెలలో విడుదల చేసిన ఓటర్ల జాబితా కన్నా సోమవారం విడుదల చేసిన జాబితాలో ఓటర్ల సంఖ్య 3 వేల 267 ఓట్లు పెరిగాయి. పెరిగిన జాబితా ప్రకారం గురజాల రూరల్‌లో పురుషులు 16,620, మహిళలు 17,325, ట్రాన్స్‌జెండర్‌లు ఇద్దరితో కలిపి 33,947 ఓటర్లు, గురజాల అర్బన్‌లో పురుషులు 10,652, మహిళలు 11,811, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు కలిపి 22,466 మంది ఓటర్లు, దాచేపల్లి రూరల్‌లో పురుషులు 16,803, మహిళలు 17,233, ఒకరు ట్రాన్స్‌జెండర్ కలిపి 34,037 మంది ఓటర్లు, దాచేపల్లి అర్బన్‌లో పురుషులు 15,403, మహిళలు 16,297, ట్రాన్స్‌జెండర్లు 12మంది కలిపి 31,712, మాచవరంలో పురుషులు 21,302, మహిళలు 21,782, నలుగురు ట్రాన్స్‌జెండర్లు మొత్తం 43,088 మంది, పిడుగురాళ్ల రూరల్‌లో పురుషులు 25,343, మహిళలు 26,516, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు మొత్తం 51,864 మంది, పిడుగురాళ్ల అర్బన్‌లో పురుషులు 26,008, మహిళలు 28140 మంది, ట్రాన్స్‌జెండర్లు 15 మంది మొత్తం 54,163 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అక్టోబరులో విడుదల చేసిన జాబితా కన్నా ఇప్పుడు విడుదల చేసిన జాబితాలో మహిళా ఓటర్లే 1919 మంది పెరిగారు.

సత్తెనపల్లి, జనవరి 22 : ఓటర్ల తుది జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజకుమారి సోమవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో విడుదల చేశారు. సత్తెనపల్లి రూరల్ మండలంలో 60,901, సత్తెనపల్లి పట్టణంలో 45,313, రాజుపాలెం మండలంలో 42,004, నకరికల్లు మండలంలో 53,435, ముప్పాళ్ళ మండలంలో 35,424మంది ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు. మొత్తం 2,39,077 మంది నియోజకవర్గ ఓటర్లు అని ఆమె తెలియజేశారు. ఓటర్ల జాబితాలను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

రెంటచింతల, జనవరి 22: మాచర్ల నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,59,279 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,27,226 మహిళలు 1,32,0331 మంది ఉన్నారు. వెల్దుర్తి మండలంలో 41,041, దుర్గి 41,274, కారంపూడి 46,454, మాచర్ల రూరల్‌లో 44,471, మాచర్ల టౌన్లో45,993 మంది, రెంటచింతల మండలంలో 40046 మంది ఓటర్లున్నారు.

పెదకూరపాడు, జనవరి 22: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితాను ప్రచురించినట్లు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి డీ నాగజ్యోతి తెలిపారు. పెదకూరపాడులో సోమవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్‌తో కలసి బోర్డుపై ఓటర్ల జాబితాను అతికించారు.

భక్తి శ్రద్ధలతో వెంకన్న శాంతి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న కొమ్మాలపాటి శ్రీధర్

అవంరావతి, జనవరి 22: మండల పరిధిలోని మల్లాది గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారికి ఉదయం పంచామృతాలతో స్నపన, ప్రత్యేక అలంకారం, శాంతి కల్యాణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగాయి. మల్లాది పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారికి పొంగళ్లు సమర్పించారు.

నేడు పెదకూరపాడులో లోకేశ్ జన్మదిన వేడుకలు

పెదకూరపాడు, జనవరి 22: పెదకూరపాడులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జరుగుతాయని టీడీపీ మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

సీపీఐ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

పెదకూరపాడు, జనవరి 22: సీపీఐ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరులో సోమవారం సీపీఐ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా సీపీఐ కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రజల పక్షాన మాట్లాడే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ కేసులు పెట్టించి పోలీసులను పావులుగా వాడుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నేత కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షత వహించగా జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులు ఉన్నారు.

చెప్పాపెట్టకుండా పోలింగ్ బూత్‌లు మార్చేశారు

● సమీక్షలో టీడీపీ నేతలు

గురజాలటౌన్, జనవరి 22: నియోజకవర్గంలోని అధికారులు చెప్పాపెట్టకుండా బూత్‌లు మార్చేశారని గురజాల ఆర్డీవో రమణకాంత్‌రెడ్డికి టీడీపీ నేతలు మొరపెట్టుకున్నారు. సోమవారం డోర్ టూ డోర్ డెలివరీ వెరిఫికేషన్ సూచనల స్వీకరణకు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇబ్బందులు ఉన్న బూత్‌లు సమావేశంలో తెలియపరిచి అన్ని రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలి. అలా కాకుండా నియోజకవర్గంలో సుమారు 35 బూత్ లు ఇష్టం వచ్చినట్టు మారిస్తే ఎలా అని ప్రశ్నించారు. బతికి ఉండగానే చనిపోయినట్లు ఓట్లు తొలగిస్తున్నారని, అలా జరగకుండా చూడాలని కోరారు. 26వ బూత్‌లో మూడు నెలల నుంచి 6, 7, 8 పెండింగ్లో ఉన్నాయని, ఇప్పటివరకు పరిష్కరించలేదని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తాను ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు చేపట్టక ముందు బూత్‌లు ఎలా మార్చారో తనకు తెలియదని, బూత్‌లు మార్చిన ప్రతి పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న ఫారం 6, 7, 8 తుది జాబితా వచ్చిందని, ప్రతి పోలింగ్‌స్టేషన్ వద్ద అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఏవైనా అభ్యంతరాలుంటే బీఎల్‌వోకు గానీ నేరుగా తనకు గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. కాగా 26వ బూత్ బీఎల్‌వోకు షోకాజు నోటీసులివ్వాలని ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మీసాల డానియేలు, కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, సర్వేశ్వరరావు, రాయపాటి రవి, పాండురంగ శ్రీనివాసరావు, హసన్ అహ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

మాచవరం, జనవరి 22: మండలంలోని వేమవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి శివయాదవ్ మాట్లాడుతూ ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందడానికి దోహదపడతాయన్నారు. వీటిని వినియోగించుకొని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాదె కనకారెడ్డి, ఎంపీటీసీ శానంపూడి శివారెడ్డి, దొండేటి కృష్ణారెడ్డి, శివాలయం చైర్మన్ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులను అడ్డగించిన రైతులు

● రంగప్రవేశం చేసిన పోలీసులు

రెంటచింతల, జనవరి 22: ఎన్‌హెచ్ 167 ఏడీ రహదారి పనులను నిలిపి వేయాలంటూ సోమవారం అన్నదాతలు ఆందోళనకు దిగారు. పనులు చేయడానికి వీల్లేదంటూ భీష్మించారు. వివరాల్లోకెళ్తే దాచేపల్లి నుంచి మాచర్ల వరకు రూ.232 కోట్లతో 43కి.మీ మేర జాతీయ రహదారుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రహదారి ఏర్పాటు నిమిత్తం భూములు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందని వాపోయారు. పనులు ఆగిపోయిన విషయం అటు రెవెన్యూ అధికారులు ఇటు పోలీసులకు తెలియడంతో రంగ ప్రవేశం చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పడంతో అన్నదాతలు అక్కడకు చేరుకున్నట్లు ఆర్ఐ కాంతారావు చెప్పారు. జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆవలివైపున ఉన్న తమ పొలాలకు నీళ్ల వచ్చే అవకాశం లేనందున వెంటనే కల్వర్టులు నిర్మించాలని మరి కొంత మంది రైతులు కోరారు.

జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగిన గ్రామాలు



పిడుగురాళ్లలో జైశ్రీరామ్ నినాదంతో రామభజన ర్యాలీ చేస్తున్న భక్తులు

పిడుగురాళ్ల, జనవరి 22: అయోధ్య రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం పట్టణంలో జైశ్రీరామ్ నినాదంతో భక్తులు, మహిళలు శ్రీరాములవారి ఉత్సవ విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆధ్యాత్మిక శోభతో పట్టణమంతా శ్రీరామ నామ జపంతో హోరెత్తింది. ఆర్యవైశ్య ప్రముఖులు కొత్త వెంకట సుబ్బారావు, కనిగిరి శ్రీను, కొత్త రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి, జనవరి 22: అయోధ్యలో రాములువారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అయోధ్యలో జరిగిన బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో గ్రామాలలో ప్రధాన వీధుల్లో రామనామాన్ని పఠిస్తూ వీధులలో కాషాయం జెండాలతో ఊరేగింపు నిర్వహించారు.

మాచవరం, జనవరి 22: మండలంలోని అన్ని గ్రామాలు జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగాయి. గ్రామ పురవీధుల్లో సీతారాముల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సత్తెనపల్లి, జనవరి 22: అయోధ్యలో శ్రీబాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నారాయణ సేవ, నగర సంకీర్తన ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తులు లైవ్‌లో సోమవారం వీక్షించారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో భక్తులు రామ భజనలు, అభిషేకాలు నిర్వహించారు. రామనామ సంకీర్తనలు ఆలపించారు.

అమరావతి, జనవరి 22: అయోధ్యలో శ్రీరాముడి ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో రామభక్తులు కాషాయ జండాలు పట్టుకుని శోభాయాత్ర నిర్వహించారు. అమరేశ్వరాలయం నుంచి ప్రధాన వీధిలో యాత్ర కొనసాగింది. అనంతరం కోదండ రామాలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

బెల్లంకొండ, జనవరి 22: మండలంలో అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బెల్లంకొండలో సోమవారం బ్రాహ్మణ శ్రీపులుపుల వెంకట ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్రోసూరు, జనవరి 22 : మండలంలోని వివిధ గ్రామాలు రామనామ సంకీర్తనలతో మార్మోగాయి. గ్రామాల్లో శోభాయాత్రలు, మోటారు బైక్‌ల ర్యాలీలతో జైశ్రీరామ్ జెండాలతో కోలాహలంగా జరిగాయి. క్రోసూరులోని పురాతన వేణుగోపాల స్వామి దేవాలయంలో రామనామ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. హసానాబాద్‌లో రామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మాచర్ల, జనవరి 22: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భం గా పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గృహానికి చేరుకొని పీఆర్కే దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

వెల్దుర్తి, జనవరి 22: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

కారంపూడి, జనవరి 22: కారంపూడిలో షిరిడీ సాయి సత్యసాయి మందిరం సభ్యుల పర్యవేక్షణలో బాలరాముడి చిత్రపటంతో గ్రామోత్సవం జరిపారు. ఆర్యవైశ్య వీధిలోని సాయి మందిరం నుంచి బయలుదేరి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో మహిళలు కాషాయవస్త్రాలు ధరించి సంకీర్తనలో పాల్గొన్నారు.

రెంటచింతల, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని రెంటచింతలలో శ్రీరామకృష్ణా సేవా మండలి, గురుకులం పాఠశాలకు చెందిన వందలాది మంది బాలబాలికలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

వైసీపీకి ఘోరీ కట్టడానికి సిద్ధంగా ఉన్నాం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



బీసీ సదస్సులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, బీసీ నాయకులు

అచ్చంపేట, జనవరి 22: వైసీపీ ప్రభుత్వానికి ఘోరీ కట్టడానికి అందరూ సిద్ధంగా ఉన్నామని, బీసీలందరూ ఐక్యంగా ఉండి హక్కులు కాపాడుకుందామని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం అచ్చంపేటలోని సాయిబాబా కల్యాణ మండపంలో మండల బీసీ సెల్ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గాదె సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా మహాత్మా పూలే, సావిత్రిబాయి, ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ బీసీలను తెలుగుదేశం ప్రభుత్వంలో ముందుంచామన్నారు. కాని వైసీపీ ప్రభుత్వం బీసీలను నట్టేట ముంచిందని విమర్శించారు. సన్న, చిన్న కారు, చేతి వృత్తుల వారికి వెన్నుదన్నుగా నిలిచింది టీడీపీ మాత్రమేనన్నారు. ఉన్నతమైన అధికారాలను బీసీలకు తెలుగుదేశం మాత్రమే ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పించింది కూడా తెలుగుదేశమేనన్నారు. టీడీపీలో 50 శాతం బీసీ నాయకులు ఉన్నారని, కాని కల్లబొల్లి మాటలు చెపుతూ ముందుకు వస్తున్న వారిని నమ్మ వద్దని, అధికార మదంతో అనే మంది బీసీ నాయకులను వైసీపీ ప్రభుత్వం జైల్లో పెట్టింది మరచి పోరాదన్నారు. బీసీలందరూ కలసి మెలసిగా ఉంటూ బలంగా ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఘోరీ కట్టడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మండల, నియోజకవర్గ మేనిఫెస్టో పెడతానని ప్రకటించారు. హక్కులు కాపాడుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జాతీయ క్రమశిక్షణా సంఘ సభ్యుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్, నల్లమేకల వెంకటేశ్వర్లు, మద్దిరాల గంగాధర్, బత్తుల రాంబాబు, బత్తుల శ్రీను, వీరాంజనేయులు, శివరాత్రి పెద్ద శ్రీను, తిరుపతి స్వామి, నరసింహారావు, చల్లా అనూపకళ, టి.ఆంజనేయులు, మోదుగుల చంద్రశేఖర్, గుంజి అంకమ్మరావు పాల్గొన్నారు. చిగురుపాడు నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం

● సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, జనవరి 22: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పట్టణ పోలీసులు సోమవారం ఉదయం రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించటం అప్రజాస్వామికమని సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నేతలు అన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను 19మందిని పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఆయా పార్టీల నేతలు పోలీసుస్టేషన్‌కు వచ్చి వారిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో గద్దె చలమయ్య, ధరణి కోట విమల, గుంటుపల్లి రజిని, గద్దె ఉమశ్రీ, తణుకుల వీరబ్రహ్మం, పూజల వెంకట కోటయ్య, అనుమోలు జయరామ్, నరిచేటి వేణుగోపాల్, దాసరి జ్ఞానరాజ్‌పాల్, చాంద్ బాషా, పాల్‌రాజ్, గుజ్జర్లపూడి కన్నా తదితరులు ఉన్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

అంగన్‌వాడీలను విడుదల చేయాలి

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టుచేసిన అంగన్‌వాడీలను తక్షణమే విడుదల చేయాలన్నారు. విధులలో చేరని అంగన్‌వాడీలను తొలగించడం ప్రభుత్వ అరాచకానికి పరాకాష్ఠ అన్నారు.

విజయవాడ ధర్నాకు తరలివెళ్ళిన అంగన్ వాడీలు

క్రోసూరు, జనవరి 22: డిమాండ్ల సాధన కోసం 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో జరిగిన మహాధర్నాకు తరలి వెళ్లారు. సుమారు రెండు వందల మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు వివిధ వాహనాల్లో విజయవాడ చేరుకున్నారు. వియవాడలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొంటుండగా పోలీసులు బలవంతంగా అరెస్టులు చేశారని యూనియన్ నాయకులు తెలిపారు. సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని బెదిరించినా, హెచ్చరికలు చేసినా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆపేది లేదని యూనియన్ నాయకులు జయలక్ష్మి, శివపార్వతి తెలియ జేశారు. అంగన్‌వాడీలకు సంఘీభావంగా క్రోసూరు మండలం నుంచి సీఐటీయూ నాయకులు గంజిమాల రవిబాబు, తిమ్మిశెట్టి హనుమంతరావు కూడా వెళ్లారు.

టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుంది

● లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా

నకరికల్లు, జనవరి 22: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.1.22 లక్షల ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా అన్నారు. నకరికల్లు సినిమాహాల్ బజారులో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అర్హులకు అందాలని, సత్తెనపల్లిలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫణి సూరి, ఢీకొండ రామదాసు, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ

సత్తెనపల్లి జనవరి 22: పట్టణంలోని 40వ పోలింగ్ బూత్ సోమవారం సాయంత్రం ఆవార్డు టీడీపి పరిశీలకుడు అల్లంశెట్టి మోహనరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ పరిధిలో ఇంటింటికీ తిరిగి భవిష్యత్తుకు గ్యారంటీ బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బలిజేపల్లి సురేష్‌కుమార్, ఉల్లం శ్రీనివాసరావు, శిఖా ఏడుకొండలు, పోట్ల రామాంజనేయులు, నూర్‌బాషా జానీబాబు, డి.బాపయ్యచౌదరి, చిలకా శ్యామ్, గుజ్జర్లపూడి చంద్ర కాంత్ తదితరులు పగన్నారు.

కులగణన సర్వేలో సర్వర్‌తో కుస్తీలు

పిడుగురాళ్ల, జనవరి 22: కులగణన సర్వే చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో తప్ప పగలు సమయంలో సర్వర్ ఎంతకీ రాకపోవడంతో సిబ్బంది ఒక్కో ఇంటివద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుంది. మహిళా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉదయం పూట గృహాల్లో పనులు మానుకొని వార్డుల్లోకి వెళ్లి కులగణన చేసిన తరువాత ఇంట్లో పని పూర్తిచేసుకొని సచివాలయ విధులు నిర్వహించి రాత్రివేళ వార్డుల్లోకి వెళ్లి కులగణన సర్వే చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని కులగణన సర్వేకు సర్వర్ వేగవంతం చేసేదాకా ఈ కష్టాలు తప్పేలా లేవని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సెబ్ సీఐగా సూర్యనారాయణ



పిడుగురాళ్ల, జనవరి 22: పిడుగురాళ్ల సెబ్ కార్యాలయ సీఐగా డి.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పనిచేస్తున్న సూర్యనారాయణ పిడుగురాళ్ల సెబ్ సీఐగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కొండారెడ్డి ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళ్లారు.

కారంపూడి సీఐగా చిన మల్లయ్య



కారంపూడి, జనవరి 22: కారంపూడి సీఐగా చిన మల్లయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన జయకుమార్ మేడికొండూరు సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చిన మల్లయ్య హెచ్చరించారు.

వైవీ జన్మదిన వేడుకలకు తరలివెళ్లిన నాయకులు



మోతడకలోని ఆయన నివాసంలో జరిగిన సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు జన్మదిన వేడుకల్లో బత్తుల నాగేశ్వరరావు, పచ్చల నాగేశ్వరరావు, మల్లవరపు చంద్రశేఖర్, జి.నరేంద్ర, అన్వర్, గుండెబోయిన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. **(ముప్పాళ్ల)**

భూసేకరణలో ప్రజాధనం దుర్వినియోగం

● జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్

సత్తెనపల్లి, జనవరి 22: పట్టణంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ కోసం జరిగిన భూసేకరణలో ప్రజాధనం దుర్వినియోగం అయిందని జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు కోసం అధికార పార్టీ నేత ఎకరం రూ. 2.22 కోట్ల చొప్పున నాలుగు ఎకరాలు రూ.8.88 కోట్లకు కొనుగోలు చేయించేందుకు కౌన్సిల్ అత్యవసర సమావేశంలో తీర్మానించారన్నారు. ఇది ప్రజాధనాన్ని దోచుకొనే ప్రక్రియలో భాగమేనన్నారు. వాస్తవంగా వ్యవసాయ భూమి విలువ అక్కడ ఎకరం రూ.26 లక్షలు ఉందని, గృహ నిర్మాణ పరంగా చూస్తే రూ.46 లక్షలు ఉందని ఆయన తెలిపారు. గతంలో కూడా వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దీనిపై తాము పోరాటం చేశామన్నారు. రూ.8.88 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వం తిరస్కరించిందని, కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి పంపమన్నదని, దీనిపై అధికారులు ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. భూముల మార్కెట్ విలువలు పెంచి క్విడ్ ప్రోకో ద్వారా అధికార పార్టీ నాయకుడు లబ్ధి పొందాలని చూస్తున్నారని చెప్పారు. దీనిపై సిట్టింగ్ జడ్జి, లోకాయుక్తతో విచారణ జరిపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని వారు కోరారు.

చంద్రబాబు సీఎం ఐతేనే రాష్ట్రాభివృద్ధి

● సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఐతేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అమరావతి రాజధానిగా కొనసాగుతుందని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అన్ని వర్గాలపై భారం మోపటం తప్ప చేసిందేమి లేదన్నారు. రాష్ట్ర సంపదను దోచుకోవటమే ధ్యేయంగా వైఎస్ జగన్ పని చేస్తున్నారన్నారు. కక్ష కట్టి నారా చంద్రబాబు నాయుడును జైలుకు పంపారన్నారు. ఈ సైకో పాలనకు అందరూ చరమ గీతం పాడాలన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు కన్నా లక్ష్మీనారాయణను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు.

అప్పారావుకు పరామర్శ

సత్తెనపల్లి పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మండలంలోని గుడిపూడి క్లస్టర్ ఇన్‌చార్జ్ గద్దె అప్పారావును కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి అప్పారావుకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్యలు ఉన్నారు. అనంతరం పట్టణంలోని 10వ వార్డు టీడీపీ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం తమ్ముడు వివాహానికి కన్నా లక్ష్మీనారాయణ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

భూరక్షణ చట్టాన్ని రద్దు చేస్తాం

భూములు కబ్జాచేసిన వారికి న్యాయం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం భూరక్షణ చట్టం అమల్లోకి తెచ్చిందని టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ చట్టాన్ని రద్దు చేస్తామని కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలైనా రాష్ట్ర ఆదాయం పెరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నష్టపోయారన్నారు. ఈ వర్గాలపై వేధింపులు ఎక్కువైయ్యాయన్నారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి

● రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు



రెడ్డిగూడెంలో ఆరోగ్యశ్రీ యాప్ సెల్‌లో డౌన్లోడ్ చేసే విధానాన్ని చూపిస్తున్న మెడికల్ అండ్ హెల్త్ జేడీ డాక్టర్ అర్జునరావు

రాజుపాలెం, జనవరి 22: ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు కోరారు. సోమవారం మండలంలోని రెడ్డిగూడెం, రాజుపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రెడ్డిగూడెంలో ఉన్న సచివాలయంలో ఆరోగ్యశ్రీ కార్డులను పరిశీలించి కార్డులను ప్రజలకు అందజేశారా లేదా ఇప్పటివరకు ఎన్ని అందజేశారు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ యాప్ సెల్‌లో డౌన్లోడ్ చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావుతో మాట్లాడారు. ఆరోగ్య శ్రీ కార్డులను ఏఎన్ఎంలు తదితరులు కలిసి ఈకేవైసీ ఈ నెల చివరినాటికి మండలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి హనుమకుమార్, వైద్యులు రవితేజానాయక్, పర్యవేక్షకులు జీవనరావు, జ్యోస్నా, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చుక్కల భూములకు త్వరలో పరిష్కారం చూపుతాం

● గ్రామ సభలో ట్రెయినీ కలెక్టర్ కల్పశ్రీ



వేమవరంలో గ్రామసభ నిర్వహిస్తున్న ట్రెయినీ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

మాచవరం, జనవరి 22: కొంతకాలంగా పరిష్కారం కాని చుక్కల భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ట్రెయినీ కలెక్టర్ కల్పశ్రీ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని వేమవరం గ్రామంలో చుక్కల భూముల సమస్యలపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చుక్కల భూముల వల్ల రైతులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం పలురకాల సూచనలు, సలహాలు తెలియజేసిందని, వాటి ప్రకారం చుక్కల భూములకు పరిష్కారం చూపిస్తామని తెలియజేశారు. రైతులు చుక్కల భూములకు సంబంధించి అర్జీలు అందజేస్తే పరి ష్కార మార్గాలు చూపుతామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దొండేటి కృష్ణారెడ్డి, గుర్రం గురవారెడ్డి, డీటీ సరోజ, శివాలయం కమిటీ చైర్మన్ మూలగుండ్ల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తెనపల్లి, జనవరి 22 : సికింద్రాబాద్ వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మధ్యాహ్నం సత్తెనపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.



గోనుగుంట్ల కోటేశ్వరరావు	నాగసరపు సుబ్బరాయగుప్తా	నాగోతు శౌరయ్య	వేములపల్లి వెంకట నరసయ్య	కడియాల రమేష్	బొడ్డపాటి పేరయ్య	కొమ్మాలపాటి ప్రభాకర్
మెట్టు వెంకటేశ్వరరెడ్డి	పులిమి వెంకటరామిరెడ్డి	కడియం కోటి సుబ్బారావు	కుమ్మెత కోటిరెడ్డి	కడియాల తాండవకృష్ణ	పూదోట సునీల్	కొట్ట కిరణ్ కుమార్
చావపాటి సైదావలి చిన్నతురకపాలెం	షేక్ సుభాని చిన్నతురకపాలెం	షేక్ మన్నాన్‌షరీఫ్ చిన్నతురకపాలెం	వేల్పుల సింహాద్రి యాదవ్	గద్దె బ్రహ్మయ్య చింతలపాలెం	యండ్లమూరి శివప్రసాదు గొనెపూడి	కంటు సాంబశివరావు గొనెపూడి
జాగర్లమూడి హనుమంతురావు గురవాయపాలెం	ఆలపాటి శ్రీను గురవాయపాలెం	పుచ్చకాయల బసవేశ్వరరావు కేశానుపల్లి	శిఖనం అమర్ కేశానుపల్లి	మచ్చు వీరయ్య కేశానుపల్లి	మెడబలిమి నవీన్ కేశానుపల్లి	గట్టినేని శ్రీను కొత్తపాలెం
ఏల్చు శ్రీనువాసరావు కొత్తపాలెం	మేకల సైదారావు కొండకావూరు	మద్దుకూరి బ్రహ్మయ్య ములకలూరు	యం.డి. ఉమర్ ములకలూరు	ఉప్పుటూరి మోహనరావు జొన్నలగడ్డ	ఉప్పుటూరి వీరరాఘవులు జొన్నలగడ్డ	నల్లపాటి చినసుబ్బారావు జొన్నలగడ్డ
బండారుపల్లి విశ్వేశ్వరరావు దొండపాడు	యన్నం శివారెడ్డి ఉప్పలపాడు	మైపతి శ్రీనివాసరావు ఉప్పలపాడు	కన్యధార రాజు రావిపాడు	పూదోట సునీల్ రావిపాడు	షేక్ ఇమాంషా పెదతురకపాలెం	గౌస్ పీరా పెదతురకపాలెం
వసంత యల్లమంద పమిడిమర్రు	గుర్రపుశాల రామకృష్ణ పమిడిమర్రు	అరవపల్లి కొండలు అర్చరపల్లి	దండా శివరామకృష్ణ కాకాని	మాలెంపాటి గురుక్రిష్ణ కాకాని	కల్లూరి శివయ్య కాకాని	గుంగల పెద్దిరెడ్డి లింగంగుంట్ల
మహానందిరెడ్డి లింగంగుంట్ల	మండాది ప్రభుదాసు లింగంగుంట్ల	రాయల శ్రీనివాసరావు	అల్లంశెట్టి మోహనరావు	యర్రమాసు ఆంజనేయులు యలమందల	కూరపాటి శ్రీనివాసరావు ఇక్కుర్రు	కొల్లి వెంకటేశ్వర్లు ఇక్కుర్రు
ఉడతా రాఘవ అల్లూరివారిపాలెం	కందిమళ్ళ వీరప్పయ్య పెట్లూరివారిపాలెం	పచ్చి శ్రీను పెట్లూరివారిపాలెం	గొట్టిపాటి జనార్ధనబాబు పెట్లూరివారిపాలెం	బండ్లమూడి చంద్రశేఖర్ ఇస్సపాలెం	అల్లూరి శ్రీను ఇస్సపాలెం	దాసరి నరసింహారావు ఇస్సపాలెం
మక్కెన ఆంజనేయులు పెదరెడ్డిపాలెం	అబ్బూరి శ్రీను పెదరెడ్డిపాలెం	కసిందుల హరిబాబు పెదరెడ్డిపాలెం	చంద్రమౌళి కె.యం. అగ్రహారం	పూనాటి శ్రీను పమిడిపాడు	మేడంపల్లి వెంకటేశ్వర్లు మునమాక	కుంపటి రవి మునమాక
మానుకొండ నిరంజన్ యలమందల	గడిపూడి నరసింహారావు వడ్లమూడివారిపాలెం	లింగా అనంతరామయ్య వడ్లమూడివారిపాలెం	జాష్ణ ప్రసాదు వీరవట్నం	మాలెంపాటి పెదకొండలు వీరవట్నం	పల్లెల నాగిరెడ్డి అన్నవరప్పాడు	లింగారావు తురుమెళ్ళ
వెన్నా నాగేంద్రమ్మ అలవాల	గాడపర్తి రామాంజనేయులు అచ్చయ్యపాలెం	మందలపు వెంకట్రావు అచ్చయ్యపాలెం	ఇంటూరి ప్రసాదు సుబ్బయ్యపాలెం	గాడిపర్తి శ్రీనివాసరావు సుబ్బయ్యపాలెం	గాడిపర్తి వెంకట్రావు సుబ్బయ్యపాలెం	శాఖమూరి రామూర్తి ముత్తనపల్లి
చిరుమామిళ్ళ బ్రహ్మయ్య ముత్తనపల్లి	గాడిపర్తి సురేష్ ముత్తనపల్లి	పులుకూరి జగ్గయ్య రొంపిచర్ల	పల్లెల గోవిందరెడ్డి రొంపిచర్ల	మందలపు వెంకట రత్నం రొంపిచర్ల	పొనుగోటి సాంబశివరావు కొనకంచివారిపాలెం	మొండితోక రామారావు కొనకంచివారిపాలెం
అల్లూరి కాళేశ్వరరావు గోగులపాడు	యండ్రు శివకోటి గోగులపాడు	లింగా వెంకటేశ్వర్లు గోగులపాడు	సూరాబత్తిని రామారావు గోగులపాడు	పొందూరి ముసలయ్య గోగులపాడు	కోవూరి శివప్రసాద్	బత్తుల కొండలు ఆరేపల్లి
దావులూరి వెంకయ్య ఆరేపల్లి	ముప్పాళ్ళ నాగేశ్వరరావు యలమందల	వడ్లమూడి కిషోర్ కర్లకుంట	తాడపనేని రామప్రసాద్ కర్లకుంట	పొనుగోటి రామారావు కర్లకుంట	మామిళ్ళపల్లి ఆదిబాబు సంతగుడిపాడు	ఉడతా రమణ సంతగుడిపాడు
మంజుల ఆంజనేయులు సంతగుడిపాడు	పెరుపోగు దాసు సంతగుడిపాడు	యేనుగంటి సాయి తుంగపాడు	మల్లికార్జునరావు తుంగపాడు	పచ్చవ కృష్ణ అన్నవరం	మక్కెన అంజయ్య అన్నవరం	పచ్చవ కోటేశ్వరరావు అన్నవరం
కందుల శ్రీనివాసరావు పరగటిచర్ల	కామినేని రంగారావు పరగటిచర్ల	దేవరపల్లి యలమందారెడ్డి నల్లగార్లపాడు	యాంపాటి కోటిరెడ్డి మాచవరం	పోతిరెడ్డి అంజిరెడ్డి మాచవరం	వనిపెంట పిచ్చిరెడ్డి రెడ్డిపాలెం	అల్లటిపల్లి శ్రీనివాసరెడ్డి రెడ్డిపాలెం
గంగారపు సైదులు రెడ్డి రెడ్డిపాలెం	రామిశెట్టి కోటయ్య విప్పర్ల	ఇమ్మడిశెట్టి కాశియ్య విప్పర్ల	జల్లిపల్లి శేషమ్మ విప్పర్ల	యామర్తి రామారావు కొత్తపల్లి	కొలికొండ వెంకటరావు కొత్తపల్లి	గంగూరి రవి కొత్తపల్లి
సూన్యావత్ రామారావు నాయక్ చాకలికుంట	కొలికొండ కొండలు ఎద్దవర్రుపేట	కొత్తూరి హనుమంతురావు	గుట్టుపల్లి సత్యనారాయణ	వనమా శివ	అత్తులూరి సుబ్బు	మాజేటి వెంకటేష్
షేక్ మీరావలి	షేక్ బడేబాబు	షేక్ రఫీ	కొలిపాక చంద్రశేఖర్	ఆళ్ళ శ్రీనివాసరావు	వల్లెపు నాగేశ్వరరావు	పోకా శ్రీనివాసరావు
గొట్టిపాటి చౌదరిబాబు	పూదోట వంశీ	కోట నాగ సుధీర్	కొండ్రకుంట కృష్ణ	పెండ్యాల అప్పారావు	గడ్డం పురుషోత్తం (రాజు)	వాసిరెడ్డి రవి
శీలు బాబూరావు	ఇన్నమూరి శ్రీనివాసరావు	బొక్కిసం శ్రీనివాసరావు	పూదోట కిరణ్	గంగాధర్ కొక్కెర పెట్లూరివారిపాలెం	గడ్డం కరిముల్లా	తిరుమలకొండ నరసింహారావు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

● అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

నరసరావుపేట రూరల్, జనవరి 22: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జనవరి 26వ తేదీన నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పోలీస్‌పెరేడ్‌ను సిద్ధం చేయాలన్నారు. పోలీస్‌బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తు, తదితర అంశాలకు సంబంధించి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ, హార్టీకల్చర్, మత్యశాఖ, మార్కెటింగ్ శాఖ, డ్వామా, పీఆర్, డీపీవో, హౌసింగ్, టిడ్కో, పుడా, విద్య, డీఆర్డీఏ, మెప్మా, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, హెల్త్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లకు ప్రణాళిక ప్రకారం రూపొందించి సిద్ధం చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తనయుడు వేధిస్తున్నాడంటూ తండ్రి ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, జనవరి 22: కుమారుడు చిత్రహింసలు పెడుతున్నాడంటూ తండ్రి సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్పీ తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లో కుటుంబ, ఆర్థిక, ఆస్తి, ఉద్యోగ మోసాలు తదితర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. యడ్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని యడ్లపాడు గ్రామానికి చెందిన ఓ తండ్రిని కుమారుడు చిత్రహింసలు పెడుతూ ఇంట్లో ఉండనివ్వటం లేదని, తగు న్యాయం చేయాలని సదరు వృద్ధుడు ఫిర్యాదు చేశాడు. నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గోనెపూడి గ్రామానికి చెందిన ఒక రైతును అదే గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అనీల్ కుమార్ డ్రోన్ ఇప్పిస్తానని రూ.7లక్షలు తీసుకొని ఇంతవరకు ఇప్పించలేదని, మరో ఐదుగురి వద్ద కూడా ఇదేవిధంగా రూ.49 లక్షలు తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రోన్ ఇప్పించకుండా మోసం చేశాడని, తగు న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశారు. దుర్గి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓబులేసునిపల్లి గ్రామానికి చెందిన ఓ పురుగు మందుల వ్యాపారి వద్ద కొంత మంది పురుగు మందులు అప్పుకు తీసుకొని వ్యాపారికి పక్షవాతం వచ్చేసరికి లెక్క చేయకుండా అతని డబ్బులు తిరిగి ఇవ్వటం లేదని తగున్యాయం చేయాలని వ్యాపారి ఎస్పీని ఆశ్రయించాడు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించటానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసేందుకు పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన భోజనాన్ని పోలీసు అధికారులు వడ్డించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరాజు, డీఎస్పీలు మహేష్, పల్లపు రాజు, బీ ఆదినారాయణ, సర్‌పుద్దీన్, ట్రెయినీ డీఎస్పీ జగదీష్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



లింగంగుంట్లలో వృద్ధులకు కళ్ళజోళ్ళ పంపిణీ చేస్తున్న ఈవోపీఆర్డీ

లింగంగుంట్లలో వృద్ధులకు కళ్ళజోళ్ళ పంపిణీ

నరసరావుపేట రూరల్, జనవరి 22: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో సచివాలయంలో సోమవారం 23మంది వృద్ధులకు ఈవోపీఆర్డీ కేవీఎస్ శివప్రసాద్ కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్లు అవసరమైన 23 మంది వృద్ధులకు కళ్ళజోళ్ళను అందజేయడం జరిగిందని ఈవోపీఆర్డీ కేవీఎస్ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● డీఎల్‌డీవో వెంకటరెడ్డి



లింగంగుంట్లలో మొక్కలు నాటుతున్న డీఎల్‌డీవో వెంకటరెడ్డి

లింగంగుంట్ల (నరసరావుపేట రూరల్), జనవరి 22: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి రోజురోజుకు పెరుగుతున్న నాగరికతతో పాటుగా వాయుకాలుష్యం కూడా పెరుగుతుందని కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీఎల్‌డీవో వెంకటరెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామజన్మభూమిలో రామమందిరం ప్రారంభోత్సవం, బాలరాముని విగ్రహం ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలోని లింగంగుంట్ల సచివాలయం-2 పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. లింగంగుంట్లలో పలు ప్రాంతాల్లో సోమవారం అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీ శివప్రసాద్, కరిముల్లా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సర్వర్ కష్టాలు

పిడుగురాళ్ల, జనవరి 22: కులగణన సర్వే చేస్తున్న వలంటీర్లు, సచి వాలయ సిబ్బందికి సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో తప్ప పగలు సమయంలో సర్వర్ ఎంతకీ రాకపోవడంతో సిబ్బంది ఒక్కో ఇంటివద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుంది. మహిళా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఉదయం పూట గృహాల్లో పనులు మానుకొని వార్డుల్లోకి వెళ్లి కులగణన చేసిన తరువాత ఇంట్లో పని పూర్తిచేసుకొని సచివాలయ విధులు నిర్వహించి రాత్రివేళ వార్డుల్లోకి వెళ్లి కులగణన సర్వే చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని కులగణన సర్వేకు సర్వర్ వేగవంతం చేసేదాకా ఈ కష్టాలు తప్పేలా లేవని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు చెబుదాంకు 108 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 22 : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం జరిగింది. స్పందన ఫిర్యాదులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా తరలి వచ్చిన అర్జీదారులలో 108 ఫిర్యాదులు అందినట్లు జిల్లా కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. అర్జీదారులు తమ వినతులను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి రావడంతో వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా వారి సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారిని కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు జగనన్నకు చెబుదాంకు హాజరు అయ్యారు.

సాగుచేసుకుంటున్నా భూమిని ఆక్రమించారు

పల్నాడు జిల్లా మండల కేంద్రం రొంపిచర్లలో డీ నంబరు 617లో సాగు చేసుకుంటున్న 20సెంట్ల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని బాధితురాలు కాకాని యలమంద ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జగనన్నకు చెబుదాం స్పందనలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త కోటయ్య కరోనా సమయంలో చనిపోయాడు. అప్పటి నుంచి పొలం దగ్గరకు వస్తే చంపేస్తామని ఆక్రమమించుకున్న కల్లి హనిమిరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటప్పారెడ్డి బెదిరిస్తున్నారని వివరించింది. కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య వివరించానని తెలిపింది. ఎస్సీ సామాజికవర్గం కావడంతో వాళ్ళు లెక్కచేయకుండా ఆక్రమించారని. ఉన్నతాధికారులు కలుగజేసుకొని న్యాయంచేయాలని యలమంద వేడుకున్నారు.

ప్రతిపక్షాల అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లు మార్చారు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జనవరి 22: నరసరావుపేట నియోజకవర్గ గ్రామాలలో ప్రతిపక్షాల అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లు మార్చారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో స్పందనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రతిపక్షాల అనుమతి లేకుండా బూత్‌లు మార్చడంతో హైకోర్టును ఆశ్రయించామని, ఆ పోలింగ్ బూత్‌లను కలెక్టర్, డీఆర్‌వో వారంలో మార్చకపోతే సమన్లు వస్తాయని, వారి తప్పనిసరిగా హైకోర్టుకు పిలిపిస్తామన్నారు. అదే విధంగా నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, మలేరియా, డెంగీ, జ్వరాలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉన్నా అక్రమ ఆస్తులు కూడగట్టుకోవడం, మద్యం, ఇసుక, గంజాయి మాఫియాతో సంపాదించుకోవడం తప్ప పారిశుధ్యం పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్ ఏదైనా కార్యక్రమం చేపట్టమని చెబితే నేను ఉండనని, ఏడో కమిషనర్‌నని చెబుతున్నారని అన్నారు. ఇవన్నీ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. స్పందన హాస్యాస్పదంగా ఉందని, 1902కు ఫోనుచేసినా న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం భూమలు ఎమ్మెల్యే కాజేస్తున్నాడని దానిమీద కూడా నియంత్రణ లేదన్నారు. రెండేళ్లుగా స్పందన కార్యక్రమానికి వస్తున్నానని, ఎక్కడ న్యాయం జరగటం లేదని, స్పందన రద్దుచేస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నియోజవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మాబు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, దాసరి నరసింహారావు, మధు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

రైతులకు పట్టాలు ఇవ్వాలి: ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి

పిడుగురాళ్ళ పట్టణ శివారులో ఉన్న ఎర్రవాగు పోరంబోకు డీ నెంబరు 309/2ఏలో భూములు సాగు చేసుకుంటున్న సన్న, చిన్న కారు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ 42సంవత్సరాలుగా 40మంది సన్న, చిన్నకారు రైతులు ఈ భూములు సాగుచేసుకుంటూ కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వీరంతా బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పేద రైతులని, రెక్కల కష్టం మీద ఆధారపడి జీవనం చేస్తున్నారని వివరించారు. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈ పొలాల్లో రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేస్తూ వీరి పొట్టకొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు సంపత్, వెంకటకృష్ణ, వడితేవ శ్రామ్‌నాయక్, మాడావత్ లక్ష్మానాయక్, సంపతి శ్రీను పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద దళిత యువకుడు ఆత్మహత్యాయత్నం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉయ్యాల శివకృష్ణ

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద మండల కేంద్రం రొంపిచర్లకు చెందిన ఉయ్యాల శివకృష్ణ అనే దళిత యువకుడు ఆత్మహత్యయత్నం చేశారు. పురుగు మందు తాగబోయిన శివకృష్ణని అడ్డుకొని పోలీసులు అడ్డుకున్నారు. రొంపిచర్లలో తనకు, తన తల్లికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని చిలకలూరిపేటలో పని చేసే హెడ్‌కానిస్టేబుల్ ఉయ్యాల రమేష్, అతని అనుచరులు కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టుకున్న ఇంటిని కూడా ధ్వంసం చేసి హెడ్ కానిస్టేబుల్ రమేష్ ఆక్రమించుకున్నారని బాధితుడు ఆరోపించారు. ఎన్నిసార్లు అధికారులకు,పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గంజాయి కేసు పెట్టి జైలులో పెట్టిస్తానని రమేష్ బెదిరిస్తున్నాడని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

గత ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత 42రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా పరభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులను, లాఠీచార్జ్‌లను ఖండించారు. రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులపై ప్రభుత్వం, పోలీసులు దౌర్జన్యాలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీఎం జీ రామకృష్ణ, కంబాల ఏడుకొండలు, జే బ్రహ్మయ్య, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా మహతి

వినుకొండ, జనవరి 22: వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా ఎం.మహతి సోమవారం నూతనంగా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో వినుకొండలో విధులు నిర్వహించిన రామ్మోహన్ ప్రమోషన్‌పై వెళ్లడంతో కొన్నాళ్లుగా జడ్జి పోస్టు ఖాళీగా ఉండటంతో మహతిని నూతనంగా నియమించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు.

మార్కెట్ ధర ప్రకారమే కందులు కొనుగోలు

● మండల వ్యవసాయాధికారి ప్రవీణ్

శావల్యాపురం, జనవరి 22: బహిరంగ మార్కెట్లో కందులను కొనుగోలు చేస్తున్న ధరకే రైతుభరోసా కేంద్రాలలో కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పల్లపోతు ప్రవీణ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కందులకు ప్రభుత్వ మద్దతుధర క్వింటాకు రూ.7500 ఉండగా, నాఫెడ్ నిర్ణయించిన ధర ప్రకారం ప్రస్తుతం కందుల ధర క్వింటాకు రూ.9445 ఉందని, రైతులు విక్రయించే రోజుకు ఏవైనా స్వల్ప వ్యత్యాసాలుంటే వాటిని బట్టే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌బీకేలలో కందుల విక్రయించిన రైతులకు నగదును 10రోజుల వ్యవధిలో వారి బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం నేరుగా జమచేస్తుందని, కాటాకూలీ, గోతాల ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందని, కందుల నగదుతో పాటు వాటిని కూడా రైతుల బ్యాంక్ ఖాతాలకు జమచేస్తుందన్నారు. మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాలలో త్వరలో కందులు కొనుగోళ్ళు ప్రారంభిస్తామని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రైతుభరోసా కేంద్రాలలోనే కందులను విక్రయించాలన్నారు. ఆయనతో పాటు ఏఈవో పూరేటి అశోక ఉన్నారు.

6892మంది డ్వాక్రా మహిళలకు 'ఆసరా' వర్తింపు

● వెలుగు ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, జనవరి 22: మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 706 డ్వాక్రా సంఘాలకు గాను 6892మంది మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసినట్లు వెలుగు ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు సోమవారం తెలిపారు. దీనికిగాను రూ.5.52కోట్లు నగదును డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం త్వరలో జమచేయనుందని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని లాంచింగ్ చేయనున్నట్లు తెలిపారు. త్వరలో మండలస్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేసి డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెక్కులను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించిన ఆసరా రుణమాఫీ నిధులను డ్వాక్రా మహిళలు దుర్వినియోగం చేయకుండా చిన్నతరహా పరిశ్రమల వైపు మొగ్గు చూపి ఆర్థికాభివృద్ధిని సాధించాలని తెలిపారు. సీసీలు ఖాజా, బేబీరాణి, రమాదేవి, రాధ, అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులను అడ్డగించిన రైతులు

రెంటచింతల, జనవరి 22: ఎన్ హెచ్ 167 ఏడీ రహదారి పనులను నిలిపి వేయాలంటూ సోమవారం అన్నదాతలు ఆందోళనకు దిగారు. పనులు చేయడానికి వీల్లేదంటూ భీష్మించారు. వివరాల్లోకెళ్తే దాచేపల్లి నుంచి మాచర్ల వరకు రూ.232 కోట్లతో 43కి.మీ మేర జాతీయ రహదారుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రహదారి ఏర్పాటు నిమిత్తం భూములు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లింపులో అన్యాయం జరిగిందని వాపోయారు. పనులు ఆగిపోయిన విషయం అటు రెవెన్యూ అధికారులు ఇటు పోలీసులకు తెలియడంతో రంగప్రవేశం చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పడంతో అన్నదాతలు అక్కడకు చేరుకున్నట్లు ఆర్ఐ కాంతారావు చెప్పారు. జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆవలివైపున ఉన్న తమ పొలాలకు నీళ్లు వచ్చే అవకాశం లేనందున వెంటనే కల్వర్టులు నిర్మించాలని మరికొంతమంది రైతులు కోరారు.



సుబ్బారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు

వీరగంధం సుబ్బారావు విగ్రహావిష్కరణ

వినుకొండ, జనవరి 22: మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరగంధం సుబ్బారావు సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సుబ్బారావు విగ్రహాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారావు గత15 సంవత్సరాలుగా గ్రామంలో సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొమ్మరాజుపల్లిలో మిరపలో పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

● జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి సైదయ్య

ఈపూరు, జనవరి 22: ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న పంటలు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన దిగుబడులు వస్తాయని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి సైదయ్య అన్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో ఎం.లక్ష్మానాయక్ సాగు చేసిన మిరప పంటలో సోమవారం పంటకోత ప్రయోగం చేశారు. ప్రకృతి పద్ధతి ద్వారా పంటలను సాగుచేయడం వలన పెట్టుబడి తగ్గుతుందన్నారు. అంతేకాకుండా అంతర పంటలను కూడా సాగుచేసి అదనపు ఆదాయం సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో అధికారులు నందకుమార్, ఎం.బాస్కరరావు, తిరుపతిరావు రైతులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తెనపల్లి, జనవరి 22: సికింద్రాబాద్ వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మధ్యాహ్నం సత్తెనపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



లబ్ధిదారులకు వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాం ప్రసాద్

'నవోదయం'తో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

● కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్, జనవరి 22: పల్నాడు జిల్లాలో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువతకు నవోదయం కార్యక్రమం ద్వారా వారికి పలు బ్యాంకుల ద్వారా ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శివశంకర్ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమంలో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న నలుగురు యువకులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి వారికి ప్రభుత్వ రాయితీ అందించడం జరుగుతుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పల్నాడు జిల్లాలోని అచ్చంపేట మండలంకు చెందిన తురక ఏసురత్నంకు 9.3లక్షల విలువగల కారు, రెంటచింతల మండలంకు చెందిన దేగల రాజేష్‌కు రూ.3.64 లక్షల విలువ గల ఎలక్ట్రిక్ ఆటో, రెంటచింతల మండలంకు చెందిన డాకోరి యాకోబుకు రూ.3.64 లక్షల విలువగల ఎలక్ట్రిక్ ఆటో, చిలకలూరిపేటకు చెందిన నవ్వూరి దుర్గా అశోక్‌కు రూ.11.8 లక్షల విలువగల కారును అందజేశారు. ప్రతి లబ్ధిదారునికి 45శాతం సబ్సిడీతో ఈ వాహనాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి వెంకటేశ్వరరావు, పీడీఆర్డీ బాలునాయక్, నవోదయం నోడల్ అధికారి కే సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటర్ల జాబితా విడుదల

● చేర్పులు 13,384, తొలగింపులు 17,940

చిలకలూరిపేట, జనవరి 22: చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను సోమవారం అధికారులు విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,24,422 మంది ఓటర్లు ఉన్నట్టుగా నిర్ధారించారు. వారిలో పురుషులు 1,07,438 కాగా మహిళలు 1,16,935మంది ఉన్నారు. మండలాల వారీగా నాదెండ్లలో మొత్తం 52,522 మంది, యడ్లపాడులో 43,957 మంది, చిలకలూరిపేట మండలంలో 41,774మంది, చిలకలూరిపేట పట్టణంలో 86,169మంది ఓటర్లు ఉన్నట్టుగా గుర్తించారు. కాగా వివిధ దరఖాస్తులను పరిశీలించి విచారణ చేసిన అనంతరం నియోజకవర్గంలో మొత్తం తొలగింపులు 17,940, చేర్పులు 13,384 ఉన్నట్టుగా తెలిపారు. రాజకీయ పార్టీలు అందించిన సమాచారం ప్రకారం తాజా జాబితాను సుమారు ఎనిమిదివేల వరకు దొంగఓట్లు తొలగించినట్లుగా తెలిసింది.

వినుకొండ నియోజకవర్గంలో ...

వినుకొండటౌన్, జనవరి 22: బొల్లాపల్లి మండలంలో పురుషులు 26,493, మహిళలు 25,878, ఇతరులు 6 మొత్తం 52,377 ఉన్నారు. ఈపూరు మండలంలో పురుషులు 19,526, మహిళలు 19,659, ఇతరులు 3, మొత్తం 39,188, శావల్యాపురం మండలంలో పురుషులు 15,897, మహిళలు 16,542, ఇతరులు 1 మొత్తం 32,440, వినుకొండ రూరల్ మండలంలో పురుషులు 22,364, మహిళలు 22,530, ఇతరులు 4 మొత్తం 44,898, వినుకొండ అర్బన్ పురుషులు 22,215, మహిళలు 23,563, ఇతరులు 7 మొత్తం 45,785, నూజెండ్ల మండలంలో పురుషులు 23,025, మహిళలు 22,592, ఇతరులు 1 మొత్తం 45,618, నియోజకవర్గంలో పురుషులు 1,29,520, మహిళలు 1,30,764, ఇతరులు 22, మొత్తం 2,60,306ఓట్లను జనవరి 22, 2024కు అధికారులు తుది జాబితాను విడుదల చేశారు. వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 351148మంది జనాభా ఉన్నట్లు ఎన్నికల అధికారులు ఓ నివేదికలో చూపించారు.

యడ్లపాడు మండలంలో ఓటర్లు 43,975



యడ్లపాడులోని 89వ బూత్‌లో ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్న బీఎల్వో శశికళ

యడ్లపాడు, జనవరి 22: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాలను అధికారులు సోమవారం ప్రకటించారు. మండలంలోని 18 గ్రామ పంచాయితీల పరిధిలో 57 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. మార్పులు, చేర్పులు అనంతరం మండలంలో మొత్తం 43,975మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 22,745మంది ఉండగా పురుష ఓటర్లు 21,212మంది ఉన్నారు. 2019లో ఓటర్ల సంఖ్య 42,163కాగా మార్పులు, చేర్పులు అనంతరం 1,812 ఓట్లు అధికంగా నమోదయ్యాయి.

నేషనల్ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో

వికాస్ స్కూల్ విద్యార్థినికి జాతీయ స్థాయి గుర్తింపు



శరణ్యకు ట్యాబ్, షీల్డ్ అందజేస్తున్న చిత్రం

చిలకలూరిపేట, జనవరి 22: హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ వారు నిర్వహించిన నేషనల్ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న వికాస్ స్కూల్ విద్యార్థిని ఏ శరణ్యకు జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 27వేల మంది విద్యార్థులు పాల్గొనగా 10వ తరగతి చదువుతున్న శరణ్య జాతీయ స్థాయిలో కీర్తి పతాకాన్ని ఎగుర వేసింది. 9వ తరగతికి చెందిన తుషారా, 6వ తరగతికి చెందిన కీర్తిప్రణతి, 5వ తరగతికి చెందిన కరిష్మారాధిక, 4వ తరగతికి చెందిన పవిత్ర ఉత్తమ స్థానాల్లో నిలిచి విజయం సాధించారు. ఈ సందర్భంగా శరణ్యకు ట్యాబ్, షీల్డ్, సర్టిఫికెట్‌ను, మిగిలిన విద్యార్థులకు షీల్డ్, సర్టిఫికెట్లను స్కూల్ డైరెక్టర్ దండా పవన్ కుమార్ సోమవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు

అనారోగ్యంతో బాలిక మృతి

● అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థికసాయం చేసిన ప్రత్తిపాటి



బాలిక తండ్రికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు సాయిబాబు

జగ్గాపురం (యడ్లపాడు), జనవరి 22: యడ్లపాడు మండలం జగ్గాపురం ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి కోటయ్య కుమార్తె మాధవి (17) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందింది. స్థానిక పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థికసాయం ప్రకటించారు. మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు ద్వారా బాలిక తండ్రి కోటయ్యకు ఆర్థికసాయాన్ని అందించారు. ఆయన వెంట గ్రామపార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

సెబ్ సీఐగా సూర్యనారాయణ

పిడుగురాళ్ళ, జనవరి 22: పిడుగురాళ్ల సెబ్ కార్యాలయ సీఐగా డి.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పని చేస్తున్న సూర్యనారాయణ పిడుగురాళ్ల సెబ్ సీఐగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కొండారెడ్డి ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళ్లారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

అంగన్‌వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టు తగదు

● సీపీఎం నాయకుల నిరసన

వినుకొండ, జనవరి 22: కోటి సంతకాలతో తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి చేరుకొని జగనన్నకు చెప్పుకుందాం కార్యక్రమంలో భాగంగా విజయవాడ బయలు దేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకోవడాన్ని సీపీఎం పార్టీ వినుకొండ పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యాలయం వద్ద సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగలకుదురు ఆంజనేయులు, తిరుమల లక్ష్మి, శివరామకృష్ణ, ముని వెంకటేశ్వర్లు, బండి కోటయ్య, ఐద్వా నాయకురాలు ఎస్‌కే నాసర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ, సీఐటీయూ నాయకుల హౌస్ అరెస్టు



చిలకలూరి పేటలో నిరసన తెలుపుతున్న అంగన్ వాడీలు

చిలకలూరిపేట, జనవరి 22: చిలకలూరిపేట నియోజక వర్గంలో పలువురు అంగన్‌వాడీ సంఘాల నాయకులు, సీఐటీయూ నాయకులను ఆదివారం రాత్రి నోటీసులు ఇచ్చి సోమవారం సాయంత్రం వరకు హౌస్‌అరెస్టు చేశారు. వారిని బయటకు రానివ్వకుండా పోలీసులు వారి గృహాల వద్ద కాపలా కాశారు. హౌస్ అరెస్టయిన వారిలో పేరుబోయిన వెంకటేశ్వర్లు, సాతులూరుకు చెందిన రమాదేవి, యడ్లపాడుకు చెందిన పరిమళ, గణపవరంనకు చెందిన జీ సావిత్రి, తిమ్మాపురంకు చెందిన రాణి తదితరులు ఉన్నారు. కాగా నియోజకవర్గంలో మొత్తం 270మంది అంగన్‌వాడీలు ఉండగా వారిలో సుమారు 150మంది వరకు విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకై వివిధ మార్గాల నుంచి తరలి వెళ్ళారు. ఐతే వారిని విజయవాడలో పోలీసులు అదుపులోకి తీసుకొని వివిధ పోలీసు స్టేషన్‌లలో ఉంచారు. విజయవాడలో అదుపులోకి తీసుకున్న వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మిగిలిన అంగన్ వాడీలు స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తమ న్యాయమైన కోర్కెలను తక్షణం ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన సాతులూరి లూధర్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, జీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో ట్రెజరీ చెక్‌బుక్‌ల దహనం



చెక్కుల దహనంను పర్యవేక్షిస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి స్వామినాథన్

నరసరావుపేట లీగల్, జనవరి 22: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం పల్నాడు జిల్లా పరిధిలోని తొమ్మిది ఉప ఖజానా కార్యాలయాలకు సంబంధించిన 4800 చెక్‌బుక్‌లను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దహనం చేసినట్టు పల్నాడు జిల్లా ట్రెజరీ అధికారి స్వామినాథన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవోఎంఎస్ 135 ఆర్థికశాఖ ప్రకారం స్ట్రాంగ్ రూమ్‌లోని వస్తువులు, ఉపయోగించని చెక్ బుక్‌లను దహనం చేయాలని ఉందన్నారు. 2018 ఏప్రిల్ 1నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్న నేపథ్యంలో పైన పేర్కొన్న వాటిని దహనం చేయటానికి జీవో జారీ చేశారన్నారు. ఆ జీవో ప్రకారం ప్రభుత్వం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పదిమంది జిల్లా స్థాయి అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఆ కమిటీ నిర్ణయం ప్రకారం జాయింట్ కలెక్టర్ మిగిలిన చెక్కులను, వస్తువులను దహనం చేయాలని ఆదేశించారని తెలిపారు. ఆ ఆదేశాలతో జిల్లాలోని తొమ్మిది సబ్ ట్రెజరీ అధికారులు వారి వద్ద ఉన్న చెక్ పుస్తకాలు, మిగిలి ఉన్న సామగ్రిని తెచ్చారు. అందరి సమక్షంలో 4,800 చెక్‌బుక్‌లను, స్ట్రాంగ్‌రూమ్‌లో మిగిలిన సామగ్రిని దహనం చేశామన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఉప ఖజానా అధికారి మౌలాలి, జిల్లాలోని తొమ్మిది ఉప ఖజానా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా నయనతార



నయనతార

నరసరావుపేట లీగల్, జనవరి 22: నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా నయనతార సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి బదిలీపై వచ్చారు. గతంలో నరసరావుపేట ఎస్‌ఐగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న ఉన్నతాధికారుల సూచనల మేరకు అక్రమ మద్య విక్రయాన్ని అరికట్టడానికి, నాటు సారా నిరోధానికి కృషి చేస్తానన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

నరసరావుపేట లీగల్, జనవరి 22: నాదెండ్ల మండలం ఇర్లపాడులో సోమవారం రాత్రి 15 మద్యం అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. నిందితురాలు అదే గ్రామానికి చెందిన దమయంతిని అదుపులోకి తీసుకున్నామని, నిందితురాలి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు.

స్తంభం తొలగించాలంటూ స్పందనలో ఫిర్యాదు

రొంపిచర్ల, జనవరి 22: రొంపిచర్ల మండలం నలగార్లపాడులో సమస్యాత్మకంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కాలనీ వాసులతో కలసి సోమవారం అరవిందబాబు నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. వర్షం వస్తే కరెంటు స్తంభానికి ఎర్త్ వచ్చి ప్రజలకు ప్రాణహాని కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొప్పుకొండలో సచివాలయం ప్రారంభం

వినుకొండ, జనవరి 22: మండలంలోని కొప్పుకొండలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంతో పాటు రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ నూతన భవనాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.30లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలా వీరాంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగెకరాల వరిగడ్డి వామి దహనం

బొందిలిపాలెం (శావల్యాపురం) జనవరి 22: మండలంలోని బొందిలిపాలెంలో ఆకతాయిలు నిప్పంటించడంతో నాలుగెకరాలలోని వరిగడ్డి వామి అగ్నికి ఆహుతయ్యింది. గ్రామానికి చెందిన చింతా బ్రహ్మయ్య తన ఇంటి సమీపంలోని దొడ్డిలో వరిగడ్డి వేశాడు. సోమవారం మధ్యాహ్నం ఆకతాయిలు వరిగడ్డివామికి నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. స్థానికులు యజమానికి సమాచారం అందించి ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దహనమైన వరిగడ్డి ధర రూ.60వేల వరకు ఉంటుందని యజమాని బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

అంబేడ్కర్ కాలనీలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- నివాస గృహాలపై వేలాడుతున్న తీగలు
- బిక్కుబిక్కుమంటున్న ఇనతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- బిక్కుబిక్కుమంటున్న స్థానికులు





అంబేడ్కర్‌కాలనీ బడి బజారులో నివాసగృహాలపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు

వినుకొండటౌన్, జనవరి 22: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలతో కాలనీవాసులు నిత్యం భయం గుప్పెట్ల మధ్య గడపాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇనుప స్తంభాలతో పూర్వం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు కాలక్రమేణ భూమికి సమీపంలో వేలాడుతండటంతో ఆ ప్రాంతంలోని కాలనీవాసులు ఇళ్ల వదిలి బయటకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా బడి బజారులో ఇటీవల నిర్మించిన నివాస గృహలపై విద్యుత్ తీగలు వేలాడుతూ ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నా కనీసం తొంగి చూసిన దాఖలాలు లేవు. ఇటీవల రెడ్డినగర్ సమీపంలో డాబాపై ఆడుకోవడానికి వెళ్లిన ముగ్గురు చిన్నారులకు కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై ఇబ్బందులకు గురవుతున్న వైనం పాఠకులకు విదితమే. ఓట్లకోసం ఇంటింటికి వచ్చి హామీలు ఇచ్చిన నేటి పాలకులకు విద్యుత్ సమస్యపై పలుమార్లు విన్నవించినా ఆలకించిన దాఖలాలు లేకపోవడంతో ఆ నాయకుల పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లను తొలగించి రక్షణ కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంను నరసరావుపేటలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై తిలకిస్తున్న భక్తులు

అంతటా మార్మోగిన రామనామం

- అయోధ్య రామవిగ్రహ ప్రతిష్ఠపై సర్వత్రా హర్షం
- ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న పట్టణాలు, గ్రామాలు
- రామసంకీర్తనలతో భక్తుల ర్యాలీలు



చిలకలూరిపేట గవ్విటి వారి వీధిలో పురోహితుల ఊరేగింపు

నరసరావుపేట, జనవరి 22: అయోధ్య ఆలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భారీ ఎల్‌ఈడీ స్క్రీన్స్‌పై శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సావాన్ని భక్త జనులు వీక్షించి పులకించిపోయారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో శ్రీరాముని ఊరేగింపు ఘనంగా జరిగింది. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టాభిరామస్వామి దేవాలయంతో శ్రీరామునికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, జనవరి 22: అయోధ్యలో సోమవారం బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో పట్టణంలో పలు కాలనీలు, వీధులు, అపార్ట్‌మెంట్లలో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు వీధుల్లో శ్రీరాముని బొమ్మతో ఉన్న కాషాయ జెండాలను ప్రదర్శించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం వారు ఐదు వందల జెండాలను పంపిణీ చేశారు. సీఆర్ కాలనీలోని వాసవి టవర్స్ వద్ద ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వీలుగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మెయిన్ రోడ్డులోని రామలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం, సన్నాసి స్ట్రీట్, స్టీల్ కొట్ల వీధి, చలివేంద్ర బజారు, గాంధీపేట, తవ్వా బాపనయ్య వీధి ప్రాంతాల్లో అల్పాహారం పంపిణీ చేసి అన్నదానం చేశారు. తవ్వా బాపనయ్య వీధిలో రామ లక్ష్మణ షోరూం వారిచే నాలుగు వందల మందికి చీరలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున పూజలు, భజనలు, రామ నామ సంకీర్తన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ మంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద నుంచి భారీఎత్తున శోభాయాత్ర జరిగింది. ఈ యాత్ర సందర్భంగా రామాలయం వద్ద హారతులు ఇచ్చారు. మెయిన్ రోడ్డులోని రామాలయం వద్ద రాత్రి దీపోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో రాముల వారి దీపోత్సవం ద్వారకామాయి సద్గురు చారిటబుల్ ట్రస్టు సి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వినుకొండలో...

వినుకొండటౌన్, జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా పల్లెలు, పట్టణంలోని వివిధ దేవాలయాల్లో జై శ్రీరామ్ అంటూ భక్తులు నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని పప్పుబజారు, మండల ఆఫీస్ కార్యాలయం, చెక్‌పోస్టుసెంటర్, ఎస్‌ఎస్‌పీ కాలనీ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు వివిధ దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద భారీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. మహిళలు నివాసగృహాల్లో ఐదు ప్రమిదెలలో దీపారాధన వెలిగించి దేవదేవుని తలచుకుంటూ పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రారంభించారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

నాదెండ్ల, జనవరి 22: మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన స్వామివారి అక్షితలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాతులూరులో ఇంటింటికి వెళ్ళి అక్షితలు పంపిణీ చేశారు. అయోధ్య రామమందిర జెండాలను ఇళ్ళపై ఎగురవేశారు. ద్విచక్ర వాహనాలతో శోభాయాత్ర నిర్వహించారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, జనవరి 22: మండలంలోని గ్రామాల్లో రామాలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రొంపిచర్ల చెరువుకట్ట సెంటర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అదే విధంగా కొనకంచివారి పాలెంలో రామాలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మిగిలిన గ్రామాల్లో కూడా శోభాయాత్రలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



చిలకలూరిపేట గాంధీపేటకు చెందిన భక్తుల ఊరేగింపు

బుచ్చిపాపన్నపాలెంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

రొంపిచర్ల, జనవరి 22: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో సోమవారం సాయంత్రం రామాలయం వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో వైభవంగా రాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఉన్నారు.

● ఈపూరు: అయోధ్యలో బాలరాముడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని రామాలయాలలో సోమవారం ప్రజలు పూజలు నిర్వహించారు. ఆలయాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అంగలూరు, కొచ్చెర్ల, కొండ్రముట్ల, ముప్పాళ్ళ తదితర గ్రామాలలోని సీతారాములకు పూజలు జరిపించారు. కార్యక్రమాలలో బీజేపీ నాయకులు కట్టాసుబ్బారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం, జనవరి 22: అయోధ్యలో సోమవారం నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా శావల్యాపురం రైల్వేగేటు సమీపంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వట్టికూటి రాంబాబు, సత్యరాజు, గొలుసు కృష్ణారావు, జాజం వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్యావల్యాపురం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొనకంచివారిపాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు





నరసరావుపేటలో యువకుల ర్యాలీ, నరసరావుపేటలో ఊరేగిస్తున్న సీతారాముల విగ్రహాలు



మాచవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అరవింద బాబు తదితరులు

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలి

● నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరవిందబాబు

రొంపిచర్ల, జనవరి 22: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తించాలన్నారు. గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకొనే పనిలో నిమగ్నమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, యాంపాటి కోటిరెడ్డి, పోలిరెడ్డి అంజిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8వరకు విధులకు న్యాయవాదుల గైర్హాజరు

నరసరావుపేట లీగల్, జనవరి 22: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా న్యాయవాదులు చేస్తున్న నిరసన కార్యక్రమాలను, విధుల గైర్హాజరును ఫిబ్రవరి 8వ తేదీ వరకు కొనసాగించలని నిర్ణయించినట్టు స్థానిక న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు గుంటూరులో సోమవారం జరిగిన జిల్లా బార్ ఫెడరేషన్ మీటింగ్‌లో నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 8వ తేదీ న్యాయవాదులు విధులకు గైర్హాజరుతో పాటు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట న్యాయవాద సంఘ కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు, న్యాయవాదులు కొండా సాంబశివరావు, బీ పిచ్చేశ్వరరావు, కే విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఈపూరు, జనవరి 22: ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని గోపువారిపాలెం అడ్డరోడ్డు వద్ద సోమవారం జరిగింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ఈర్ల రాజేష్ (21) బైక్‌పై ఈపూరు వస్తుండగా గోపువారిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న కర్రలు రాజేష్ కడుపులో బలంగా తగలడంతో కింద పడిపోయాడు. గాయపడిన రాజేష్‌ను ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ రాజేష్ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.



అంజయ్యను పరామర్శిస్తున్న కోడెల శివరామకృష్ణ

అంజయ్యకు శివరామకృష్ణ పరామర్శ

రొంపిచర్ల, జనవరి 22: మండల కేంద్రమైన రొంపిచర్లలో మాదినీడి అంజయ్యను టీడీపీ యువ నాయకులు కోడెల శివరామకృష్ణ సోమవారం పరామర్శించారు. ఇటీవల ఆయన నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. సమాచారం తెలుసుకున్న శివరామకృష్ణ రొంపిచర్లకు వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆయన కోరుకున్నారు. శివరామకృష్ణ వెంట కొక్కిరాల శ్రీనివాసరావు, శివారెడ్డి, వెంకట రత్నారెడ్డి, అంచా శ్రీనివాసరావు, నెల్లూరి పాపారావు, పొనుగోటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు, కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మాథ్యూబాబు, గడ్డం వెంకటరావు, పడాల చక్రారెడ్డి

గెలుపొందిన జట్లకు నగదు, కిట్లు పంపిణీ

రొంపిచర్ల, జనవరి 22: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదు, కిట్లు సోమవారం పంపిణీ చేశారు. రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 పూర్వ విద్యార్థులు రూ.32వేలు అందజేశారు. వీటితోపాటు ప్రభుత్వం తరుపు నుంచి వచ్చిన కిట్లు పంపిణీ చేశారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాథ్యూబాబు, గడ్డం వెంకటరావు, పడాల చక్రారెడ్డి, కో-ఆర్డినేటర్ సైదయ్య, ఫిజికల్ డైరెక్టర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో 32,440మంది ఓటర్లు

శావల్యాపురం, జనవరి 22: కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో మొత్తం 32,440 మంది ఓటర్లు ఉన్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొత్తం ఓటర్లలో 15,897మంది పురుషులు ఉండగా, 16,542మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జండర్ ఉన్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్వోల ఆధ్వర్యంలో మంగళవారం ఓటర్ల తుది జాబితాలను ప్రచురించడం జరుగుతుందని, ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటర్ల జాబితాలను సరిచేసుకోవాలని తెలిపారు.

రేపు నరసరావుపేట సంగం డెయిరీ కేంద్రంలో రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, జనవరి 22: నరసరావుపేట పాల శీతలీకరణ కేంద్రంలో 24న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని డెయిరీ మేనేజర్ వీరేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో నరసరావుపేట సంగం డెయిరీ ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మాజీ రెవెన్యూశాఖ మంత్రి, సంగం డెయిరీ అభివృద్ధి ప్రదాత ధూళిపాళ వీరయ్య చౌదరి 30వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పరిసర ప్రాంతంలోని రక్తదానం చేసే ఆవకాశం ఉండి గొప్ప మనసున్న ప్రతి ఒక్కరు రక్తదాన కార్యక్రమంలో పాల్గొని మరొకరికి ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు.

ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, జనవరి 22: ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నరసరావుపేట పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ సెంటర్‌లోని సిద్ధార్థ ఎయిడెడ్ పాఠశాలలో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ ఉస్మాన్, ప్రధాన కార్యదర్శిగా మక్కెన శ్రీనివాసరావు ఎన్నిక అయ్యారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా ఎన్నికల అధికారిగాను, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా ఎన్నికలలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిల తోపాటు మొత్తం 13మంది నూతన జిల్లా సబ్ కమిటీని, ఆడిట్ కన్వీనర్‌తో పాటు నలుగురు సభ్యులను, ఐదుగురు రాష్ట్ర కౌన్సిలర్లను మొత్తం 30 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.